సంపుటి : 9
సంచిక : 278
బుధవారం
01 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

### వికసిత్ భారత్ లక్ష్యసాధనలో

# యువత కీలక పాత్ర పోషించాలి



★ పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం

★ ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన

★ గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి

★ కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలోని నోవాటెల్‌లో నిర్వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి బంగారు పతకాలు బహూకరించారు. గిరిజన వర్సిటీ.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా నిలుస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది మిగతా .. 2లో..

### ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు

# 'మినరల్ మ్యాపింగ్'

- ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్.. ఆదాయం పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్ చేయాలని సీఎం ఆదేశం
- ఖనిజాలకు రాష్ట్రంలోనే విలువ జోడింపు ద్వారా ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి
- అరుదైన ఖనిజాల వెలికితీతకు క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా పర్యవేక్షించాలని స్పష్టం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడించే (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతోనే మిగతా .. 2లో..

### ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు

## క్యాట్‌లో చుక్కెదురు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ మిగతా .. 2లో..

### డిగ్రీలు కాదు... ప్రజల జీవితాల్లో

# మార్పు తెచ్చేదే నిజమైన విద్య

అన్ని వర్గాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని వ్యాఖ్య
విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం : మంత్రి నారా లోకేష్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, కేవలం డిగ్రీలు సంపాదించడం విద్యకు పరమార్థం కాదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి, దేశంలోని ప్రతి మూలకు చేరినప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ "ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు మిగతా .. 2లో..

# మహారాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో మిగతా .. 2లో..

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన

## తెదేపా నాయకుడు

చంద్రబాబు పరామర్శ

**ఇల్లెందు గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గంలోని సత్యనారాయణపురానికి చెందిన తెదేపా నాయకుడు బాసాని నాగేశ్వరరావు ఈనెల 27న ముదిగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మం పార్లమెంట్ కార్యదర్శి కేతినేని హరిచంద్ర, తెలుగు యువత రాష్ట్ర నాయకులు పొగాకు జయరాం, ఇల్లెందు నియోజకవర్గ తెదేపా మిగతా .. 2లో..

### రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల

# పెట్టుబడులను ఆకర్షించాం

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ. 11.77 లక్షల కోట్లుగా ఉంది
ఈ ప్రాజక్టుల వల్ల దాదాపు 10.32 లక్షల ఉపాధి అవకాశాలు లభిస్తాయి
యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి టీజీ భరత్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. గత రెండేళ్ల కాలంలోనే రాష్ట్రం సుమారు రూ.20 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో మిగతా .. 2లో..

### కాళేశ్వరం కూలినా.. వరి సాగులో

# తెలంగాణ నంబర్ వన్


తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రూ.వేల కోట్ల కమీషన్ల కోసం బీఆర్ఎస్ హయాంలో హడావుడిగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు మిగతా .. 2లో..

# నాపై దాడికి యత్నించారు

గచ్చిబౌలి పీఎస్‌లో నటుడు అఖిల్‌రాజ్ ఫిర్యాదు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సినీనటుడు అఖిల్‌రాజ్ (రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్) ప్రయాణిస్తున్న కారుపై ఫుడ్ డెలివరీ బాయ్ రమేశ్ తన అనుచరులతో కలిసి దాడికి యత్నించాడు. ఫుడ్ డెలివరీ విషయంలో ఈ ఇద్దరి మధ్య జరిగిన గొడవ వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో డెలివరీ బాయ్‌పై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో అఖిల్‌రాజ్ ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే అఖిల్‌రాజ్ మంగళవారం తన తల్లిదండ్రులతో కలిసి మిగతా .. 2లో..




# జన్మతః పౌరసత్వం

ట్రంప్‌నకు సుప్రీంలో షాక్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా సుప్రీం కోర్టులో అధ్యక్షుడు ట్రంప్‌నకు చుక్కెదురైంది. జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనలను అక్కడి సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. జన్మతః పౌరసత్వాన్ని అమెరికా సుప్రీం కోర్టు సమర్థించింది. కొన్ని పరిమితులు మినహా.. ఇక్కడ పుట్టిన ప్రతి ఒక్కరూ దేశ పౌరులేనని స్పష్టం చేసింది. విదేశాలకు చెందిన దంపతులకు అమెరికాలో పిల్లలు పుట్టినప్పటికీ వారికి ఆ దేశ మిగతా .. 2లో..

### ఇది 'ఆపరేషన్ టైగర్' కాదు..

# 'ఆపరేషన్ దేవేంద్ర' : ఆదిత్య ఠాక్రే



**విశ్వం వాయిస్ న్యూస్ :** మహా రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఇటీవల శిందే వర్గంలో చేరిపోగా.. తాజాగా ఓ ఎమ్మెల్సీ కూడా అదే బాటలో వెళ్లారు. అధికార కూటమి మహాయుతి తరఫున మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. తాజా పరిణామాలపై ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ.. మిగతా .. 2లో..

### అరుణాచల్‌ప్రదేశ్‌లో

# చైనా చొరబాట్లంటూ ప్రచారం

స్పందించిన భారత సైన్యం



**విశ్వం వాయిస్ న్యూస్ :** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం అవుతున్నాయి. వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. "అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారం" అని వెల్లడించింది. మీడియా కథనాల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు 'మినరల్ మ్యాపింగ్'

రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**అరుదైన ఖనిజాలపై ప్రత్యేక దృష్టి**

ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాల్లో కీలకంగా ఉపయోగపడే అరుదైన భూ ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్)పై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీ, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఈ ఖనిజాల కోసం ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి అత్యంత విలువైన ఖనిజాల నిల్వలను కచ్చితంగా అంచనా వేయాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని జొన్నగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాల్లో ఉన్న బంగారం నిల్వలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర బ్లాకుల్లోనూ అన్వేషణ జరపాలని గనుల శాఖకు సూచించారు. రాష్ట్రంలో మొత్తం 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్, ఇతర విలువైన ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు.

**టెక్నాలజీతో ఇసుక పర్యవేక్షణ**

ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఇసుక విధానంలో పారదర్శకతకు, అక్రమాలకు తావులేకుండా చూడటానికి టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు, శాటిలైట్ చిత్రాల ద్వారా నిరంతర నిఘా, ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం సమకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు క్యాట్‌లో చుక్కెదురు

ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ కొట్టివేసింది. తీవ్ర అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ నేడు సర్వీస్ నుంచి రిలీవ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజైనా తనకు రిలీఫ్ ఇవ్వాలని సునీల్ కుమార్ క్యాట్‌ను కోరారు. మంగళవారం ఉదయం జరిగిన విచారణలో సునీల్ వాదనలు విన్న క్యాట్.. సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. సునీల్ కుమార్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు ఎలాంటి మినహాయింపులు లేవని, అవి కొనసాగుతాయని మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయనకు లభించాల్సిన పెన్షన్ ప్రయోజనాలు అఖిల భారత సర్వీసుల నియమాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు లోబడి ఉంటాయని పేర్కొంది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెదేపా నాయకుడు

కో-ఆర్డినేటర్ ముద్రగడ వంశీ, విజయలక్ష్మీనగర్ సర్పంచి రమేశ్‌బాబు సహకారంతో ఖమ్మంలో చికిత్స పొందుతున్నారు. పార్టీ నేతల ద్వారా విషయం తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు.. నాగేశ్వరరావుతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. కోలుకున్న తర్వాత మంగళగిరి పార్టీ కార్యాలయానికి రావాలని చంద్రబాబు తెలిపారని వంశీ వెల్లడించారు.

## మార్పు తెచ్చేదే నిజమైన విద్య

అందించే సంస్థలు కావు. అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, నాయకులను తయారు చేస్తాయి. ఈ రోజు జరుగుతున్నది కేవలం ఒక స్నాతకోత్సవం కాదు, ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక" అని అభివర్ణించారు.

**అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి**

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, అన్ని వర్గాలు భాగస్వాములైనప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని లోకేశ్ తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలుగా కాకుండా, సామాజిక పరివర్తనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే, ఆ కుటుంబంతో పాటు దేశం కూడా పురోగమిస్తుంది. మన గిరిజన వారసత్వాన్ని కాపాడుకుంటూ, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే వికసిత్ భారత్ స్ఫూర్తి" అని ఆయన వివరించారు.

**ఏఐ యుగంలో మానవ విలువల ప్రాధాన్యం**

ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో మానవ విలువల ప్రాధాన్యతను లోకేశ్ నొక్కిచెప్పారు. "ఏఐ మనకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వం వంటి లక్షణాలను ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అందుకే వర్సిటీలు నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను తయారు చేయాలి" అని ఆయన ఆకాంక్షించారు.

**భవిష్యత్ నాయకులను తయారు చేస్తాం**

ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలే కీలకమని లోకేశ్ అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు తెలుపుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. "మా లక్ష్యం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడం. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి వర్సిటీ ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "డిగ్రీ మీకు వృత్తిని ఇస్తుంది, కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదిస్తుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు శాశ్వత వారసత్వాన్ని అందిస్తుంది" అని హితవు పలికారు. అంతకుముందు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వర్సిటీ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు

జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

## పెట్టుబడులను ఆకర్షించాం

విజయవంతమైందని, ఇందులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 10.32 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం పెట్టుబడుల్లో ఏపీ వాటా 24.3 శాతానికి చేరుకుందని, పారిశ్రామిక అనుమతులను వేగంగా ఇస్తూ రాష్ట్రం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంత్రి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ అండ్ డ్రోన్ సిటీ, స్టీల్ ప్లాంట్లు వంటి అత్యాధునిక రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' అనే వినూత్న విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలోని సరికొత్త ఆలోచనలను, ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శ్రీహరికోటను కేంద్రంగా చేసుకుని స్పేస్ సిటీతో పాటు స్పేస్ టూరిజాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'భవ్య' పార్కుల్లో కనీసం 3 నుంచి 4 పార్కులను ఏపీకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని... ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని వెల్లడించారు.

# గతాన్ని వదిలేయ్.. వర్తమానాన్ని గెలిచేయ్!

మనిషి తన ఆయుష్షు ప్రయాణంలో అడుగడుగునా ఎన్నో తప్పటడుగులు వేస్తుంటాడు. కొన్ని తప్పులు పాఠాలు నేర్పితే, మరికొన్ని జీవితాంతం వెంటాడే గాయాలుగా మిగిలిపోతాయి. లక్ష్మీదేవి అనుగ్రహం తప్పి, చేతిలో ఉన్న పైకం చేజారిపోతే మళ్ళీ చెమటోడ్చి సంపాదించుకోవచ్చు. ఆరోగ్యం క్షీణించి మంచాన పడినా, ఆధునిక వైద్యంతో తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చుకోవచ్చు. సమాజంలో ప్రతిష్ట మసకబారినా, అహర్నిశలు శ్రమించి, నిప్పులాంటి నిజాయితీతో ఆ కీర్తి కిరీటాన్ని మళ్ళీ తలపై ధరించవచ్చు. కానీ, కాలచక్రంలో ఒక్కసారి వెనక్కి వెళ్ళిపోయిన అద్భుతమైన వస్తువును మాత్రం ఏ శక్తీ తిరిగి తీసుకురాలేదు అదే కాలం, సమయం. జీవితంలో అత్యంత ఖరీదైన తప్పిదం ఒక్కటే, తనకు ఉన్న సమయాన్ని గుర్తించలేకపోవడం, దానిని తెలివిగా వినియోగించుకోలేకపోవడం. నేటి వేగవంతమైన ఆధునిక జీవన స్రవంతిలో మన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తే ఒక చేదు నిజం బోధపడుతుంది. అత్యధికులు రేపు చూద్దాం, కాసేపయ్యాక చేద్దాంలే, ఈ ఏడాదికింతే, వచ్చే ఏడాది నుండి సరికొత్తగా ఆరంభిద్దాం అంటూ తమ అమూల్యమైన జీవిత క్షణాలను నిరంతరం వాయిదా వేస్తూ కాలయాపన చేస్తుంటారు. ఈ వాయిదా వేసే మానసిక రుగ్మత లేదా అలవాటే అన్ని వ్యసనాలకంటే అత్యంత ప్రమాదకరమైన మత్తుమందు. ఇది మీ జేబులోని సొమ్మును నేరుగా దోచుకోదు, మీ శరీర ఆరోగ్యాన్ని ఒక్కరోజులో పాడుచేయదు కానీ, ఒక నిశ్శబ్ద హంతకుడిలా మీ జీవితాన్నే కబళించేస్తుంది. అమెరికాలో ఒక ప్రసిద్ధ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త వృద్ధులతో చేసిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. వారు తమ జీవితంలో చేసిన పనులపై పశ్చాత్తాపం కంటే, చేయలేకపోయిన పనులపైనే ఎక్కువగా కుమిలిపోతున్నారని తెలిసింది. ఆనాడు నేను ఆ వ్యాపార సాహసం చేసి ఉంటే ఎంత బాగుండేది,నా మనసులోని ప్రేమానురాగాలను ఆ క్షణంలోనే వ్యక్తపరిచి ఉంటే ఎంత అద్భుతంగా ఉండేది,కష్టమైనా ఆ చదువులను పూర్తి చేసి ఉంటే బాగుండేది అనే ఈ నిస్సహాయ నిట్టూర్పులు వారి చివరి శ్వాస వరకూ వేధిస్తూనే ఉన్నాయట. చేసిన పొరపాట్లకు ఏదో ఒక రూపంలో క్షమాపణో, సమాధానమో వెతుక్కోవచ్చు. కానీ, అసలు ప్రయత్నమే చేయకుండా వదిలేసిన పనుల వల్ల కలిగే పశ్చాత్తాపానికి కాలం దగ్గర కూడా సమాధానం దొరకదు. ఆ మానసిక వేదనే జీవితంలో మనం చెల్లించే అత్యంత ఖరీదైన మూల్యం.చాలా మంది యువతీ యువకులు నిరంతరం ఒక భ్రమలో బతుకుతుంటారు నాకు సరైన అనుకూల సమయం వచ్చాక, అదృష్టం తలుపు తట్టాక నా అసలు విశ్వరూపం చూపిస్తాను అని. కానీ యదార్థం ఏమిటంటే, సృష్టిలో పరిపూర్ణమైన లేదా సరైన సమయం అంటూ విడిగా ఏదీ ఉండదు. అవకాశాలు అనేవి సాగర కెరటాల లాంటివి. ఆ కెరటాల వేగాన్ని అందుకొని సర్ఫింగ్ చేసిన వారికి జీవితం ఒక అందమైన పూలదోసిలి అవుతుంది, సమయం కోసం వేచి చూస్తూ కూర్చున్న వారికి అది నిరాశతో కూడిన ఎడారిగా మారుతుంది.ప్రపంచాన్ని శాసించిన గొప్ప గొప్ప పారిశ్రామికవేత్తలు, విప్లవాత్మక ఆవిష్కరణలు చేసిన శాస్త్రవేత్తలు, కళా ప్రపంచాన్ని ఏలిన దిగ్గజాలు వీరెవరూ కూడా తమ జీవితంలో రాజ ముహూర్తం కోసం నిరీక్షించలేదు. వారు ఏ స్థితిలో ఉన్నారో, అక్కడి నుంచే తమ ప్రస్థానాన్ని సంకల్పబలంతో ప్రారంభించారు. ఉన్న సమయాన్నే ఆయుధంగా మలచుకున్నారు. మన తెలుగులో ఒక అద్భుతమైన నానుడి ప్రచారంలో ఉంది ఉన్నది ఉన్నట్లు వాడుకో, లేనిదానికి వాపోకు. ఈ సుభాషితం కేవలం వేదాంత తత్త్వం మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాల్సిన నిఖార్సైన జీవన వ్యూహం. ప్రస్తుత క్షణంలో మీ వద్ద ఉన్న సమయం, మీ శారీరక శక్తి , మీ మేధో నైపుణ్యం ఇవే మీ అసలైన సంపద. దీన్ని విస్మరిస్తే ఎంతటి కుబేరుడైనా కాలగర్భంలో కలిసిపోవాల్సిందే. నేటితరం చేస్తున్న రెండవ అతిపెద్ద ఖరీదైన పొరపాటు నిరంతరం పక్కవారితో తమను తాము పోల్చుకోవడం. సోషల్ మీడియా యుగంలో ఇది మరింత ప్రమాదకరంగా మారింది. ఒకరి హైలైట్ రీల్ చూసి మన జీవితాన్ని తక్కువగా అంచనా వేసుకుంటాం. కానీ గుర్తుంచుకోండి, ప్రతి మనిషి డిజైన్ వేరు, వారి జీవన ప్రయాణం వేరు, వారి గమ్యస్థానాలు వేరు. ఈ అంధానుకరణ, పోలిక అనేవి మీ సృజనాత్మకతను చంపేసి, జీవితంలో ముందడుగు వేయకుండా కాళ్ళకు బంధాలు వేస్తాయి.

గెలుపు గుర్రాలు ఎప్పుడూ పక్కన ఉన్న గుర్రాన్ని చూడవు, కేవలం తమ గమ్యం వైపే పరిగెడతాయి. నిజమైన విజేతలు కేవలం నిన్నటి తమ నైపుణ్యంతో, నేటి తమ ప్రగతిని మాత్రమే బేరీజు వేసుకుంటారు. నిన్నటి కంటే నేడు నేను ఎంత మెరుగయ్యాను? ఏం నేర్చుకున్నాను? అని అంతర్మథనం చెందడమే నిజమైన వ్యక్తిత్వ వికాసం.జీవితంలో మూడవ భయంకరమైన తప్పిదం తన సామర్థ్యంపై తనకే నమ్మకం లేకపోవడం. ప్రపంచ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిన ఏ ఒక్క మహానుభావుడి ప్రయాణమూ పూలబాట కాదు. వారి హృదయాల్లోనూ ఒకప్పుడు అపజయం తాలూకు భయాలు, సందిగ్ధాలు ఉన్నాయి. కానీ వారు భయాన్ని చూసి పారిపోలేదు, ఆ భయాన్ని ఎదుర్కొంటూ ధైర్యంగా అడుగులు వేశారు. వైఫల్యం అనేది మీ జీవిత పుస్తకంలో ఆఖరి పేజీ కాదు, అది ఒక కొత్త అధ్యాయానికి నాంది మాత్రమే. విఫలమైన ప్రతిసారీ రెట్టింపు ఉత్సాహంతో, నేను లొంగిపోను అని గర్జించిన వారే కాలక్రమంలో చరిత్ర సృష్టికర్తలుగా అవతరించారు.మన తెలుగు నేల గర్వించదగ్గ వారసత్వాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే శ్రీకృష్ణదేవరాయలు, పొట్టి శ్రీరాములు, పింగళి వెంకయ్య వంటి మహానుభావులు ఎన్నో అగ్నిపరీక్షలను ఎదుర్కొన్నారు. వారు తమ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, ఆశయ సాధనలో అచంచలంగా నిలిచారు కాబట్టే నేటికీ మన గుండెల్లో చిరస్మరణీయులుగా వెలుగుతున్నారు.ఈ క్షణాన ఈ వ్యాసం చదువుతున్న మిత్రమా, నీకో అంతరంగిక సందేశం! ఇప్పటివరకూ సమయాన్ని వృథా చేశానని, ఎన్నో సువర్ణావకాశాలను చేజార్చుకున్నానని గతాన్ని తలచుకొని కన్నీరు కార్చడం ఆపేయ్. ఎందుకంటే, గతించిపోయిన నిన్న నీ ఆధీనంలో లేదు, రాబోయే రేపు నీకు గ్యారెంటీ లేదు. కానీ, ప్రస్తుతం నీ చేతిలో ఉన్న ఈ ప్రస్తుత క్షణం వంద శాతం నీది మాత్రమే. ఈ ఒక్క క్షణాన్ని సంకల్ప బలంతో, సరైన దిశలో పెట్టుబడిగా పెడితే నీ భవితవ్యం అద్భుతంగా మారుతుంది.నేలలో పడిన విత్తనం మొలకెత్తిన రోజో, పూలు పూసిన రోజో కాదు, అది మధురమైన ఫలాలను అందించిన రోజే దానికి సార్థకత లభిస్తుంది. నీ నిరంతర కృషి, సమయపాలన, ఏకాగ్రత అనేవి నువ్వు నాటే విత్తనాలు. వాటిని శ్రద్ధ అనే నేలలో నాటితే విశ్వమంతా అబ్బురపడే విజయాలు నీ సొంతమవుతాయి. అంతిమంగా, జీవితంలో అతిపెద్ద ఖరీదైన తప్పు అంటే సంపదను కోల్పోవడం కాదు. నేను సాధించగలను అనే ఆత్మశక్తి ఉండి కూడా, సోమరితనంతో ఏమీ చేయకుండా కాలం గడపడమే. నీ అంతరంగంలో దాగి ఉన్న శక్తిని గుర్తించు. ఆ శక్తిని మేల్కొలిపి, కాలాన్ని నీకు దాసోహం చేసుకుంటే, అదే నీ అసలైన దివ్య సంపద మరియు జీవన విజయ రహస్యం.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## తెలంగాణ నంబర్ వన్

పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో నిర్వహించిన సభలో రైతు భరోసా నిధుల పంపిణీని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు.

**కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీ పూర్తిచేశారా?**

"కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా?దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు?పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని భార్యాభర్తలు మాట్లాడుకునే ఫోన్లు విన్నారు. దొంగచాటుగా తన ఫోన్లు విన్నారని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా?పశ్చిమ బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవు. అక్కడ గెలిచేందుకు భాజపాకు 15 ఏళ్లు పట్టింది. తెలంగాణలోనూ ఆ పార్టీ గెలవాలంటే మరో 15 ఏళ్లు పడుతుంది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం.

## నాపై దాడికి యత్నించారు

కారులో గుడికి వెళ్తుండగా.. రమేశ్ తన అనుచరులతో వచ్చి ఒక్కసారిగా రాళ్లతో దాడికి యత్నించాడు. ఈ ఘటనపై అఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రమేశ్‌తోపాటు అతని స్నేహితుడు సందీప్, మరో నలుగురిని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జన్మతః పౌరసత్వం

పౌరసత్వం వర్తించబోదని వాదిస్తున్న ట్రంప్.. ఇందుకు సంబంధించి అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. "పౌరసత్వం అనేది అప్పుడూ, ఇప్పుడూ.. మన రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం కల్పించే హక్కు. ఈ దేశంలో జన్మించే ప్రతి వ్యక్తికి వీటిని అందిస్తామని 14వ సవరణ రూపకర్తలు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానాన్ని మేము ఈరోజు నిలబెట్టుకుంటున్నాం" అని సవరణపై చట్టసభలో చర్చను ప్రస్తావిస్తూ చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ తీర్పు వెల్లడించారు. అమెరికాలో జన్మించే ప్రతి ఒక్కరికీ పౌరసత్వ హక్కును కొనసాగించాలని సుప్రీం ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు పేర్కొన్నారు. ఇదిలాఉంటే, గ్రీన్‌కార్డు హోల్డర్లు కానివారి పిల్లల పౌరసత్వాన్ని గుర్తించవద్దని ట్రంప్ గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, దిగువ కోర్టులు వీటిని తిరస్కరించగా.. తాజాగా సుప్రీం కోర్టు కూడా దిగువ కోర్టుల నిర్ణయాన్ని సమర్థించింది.

## 'ఆపరేషన్ దేవేంద్ర' : ఆదిత్య ఠాక్రే

ఈ ప్రభావం పార్టీపై ఏమాత్రం ఉండబోదన్నారు. ప్రతిపక్ష నాయకులను ప్రలోభపెట్టే ఈ ప్రయత్నం 'ఆపరేషన్ టైగర్' కాదని.. అది 'ఆపరేషన్ దేవేంద్ర ఫడణవీస్' అని విమర్శించారు. తనకు సన్నిహితుడిగా పేరున్న ఎమ్మెల్సీ సచిన్ అహిర్ పార్టీ మారటంపై ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ.. అన్ని పదవులు పొందిన ఆయన స్వప్రయోజనాల కోసమే పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వాళ్లు అన్ని వ్యవస్థలపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టిన ఆయనే.. ఇప్పుడు వాళ్ల పక్కన కూర్చుంటున్నారని విమర్శించారు. అహిర్ వెళ్లిపోవడం వల్ల వర్లీ, శివ్‌డీ ప్రాంతాల్లో తమ పార్టీకి ఎటువంటి నష్టం ఉండదన్నారు. శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు తమ పార్టీలో చేరినట్లు శివసేన అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిని ఆపరేషన్ టైగర్‌గా (రాజూవతీఖ్‌అశీఅ ంఅస్త్రవతీ)గా పేర్కొంటూ.. అది అధికారికంగా పూర్తయిందని చెప్పారు. దీంతో తీవ్ర కష్టాల్లో కూరుకుపోయిన శివసేన (యూబీటీ)కి మరో ఎమ్మెల్సీ షాక్ ఇచ్చారు. అంతేకాదు.. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేల సమక్షంలో మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు.

## చైనా చొరబాట్లంటూ ప్రచారం

ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## యువత కీలక పాత్ర పోషించాలి

అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ విశ్వవిద్యాలయం గిరిజన యువత సర్వతోముఖాభివృద్ధికే కాకుండా, ఈ ప్రాంత సమగ్ర వికాసానికి కూడా గణనీయమైన కృషి చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రియమైన విద్యార్థులారా, ఈ స్నాతకోత్సవం మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది సంతోషించుకునే రోజే అయినా, భవిష్యత్తుపై సంకల్పం తీసుకోవడానికి కూడా ప్రేరణనిస్తుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే యువత నూతన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు, మీ పరిసరాల నుంచి నేర్చుకుంటూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. తమ సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం కొనసాగిస్తూనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు. అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, చిరుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఎకో-టూరిజం, స్థానిక నైపుణ్యాలను ప్రోత్సహించేలా గిరిజన విశ్వవిద్యాలయాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఉత్తరాంధ్ర గిరిజన తెగల సాధికారత కోసం ఈ వర్సిటీ 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్'ను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన పరిరక్షణ వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమ సమాజంతో కూడిన వికసిత భారత్ నిర్మాణంలో ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## విద్య మారితేనే యువత భవిష్యత్తు మారుతుంది

ఒక సమాజం ఎంత ముందుకు వెళ్తుందో తెలుసుకోవాలంటే ఆ సమాజంలోని విద్యా వ్యవస్థను, యువత ఆలోచనా విధానాన్ని చూడాలి. విద్య అనేది కేవలం మార్కులు సాధించడం కోసం కాదు. మనిషిని ఆలోచించేలా చేయడం, బాధ్యత కలిగించడం, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడం విద్య యొక్క అసలు లక్ష్యం.

నేటి యువతలో ప్రతిభ ఉంది, కలలు ఉన్నాయి, కష్టపడే శక్తి ఉంది. కానీ సరైన మార్గదర్శకత్వం లేకపోవడం, చదువుకు ఉద్యోగానికి మధ్య పెరుగుతున్న అంతరం, పోటీ ఒత్తిడి, మొబైల్ మరియు సోషల్ మీడియా ప్రభావం వంటి కారణాలతో అనేక మంది యువత గందరగోళంలో పడుతున్నారు. డిగ్రీలు ఉన్నా దిశ లేకపోతే భవిష్యత్తు బలహీనమవుతుంది.

పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలు కూడా నేర్పాలి. చదువు పూర్తయిన తర్వాత యువత ఉద్యోగం కోసం ఎదురుచూడే స్థితి కాకుండా, అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. అందుకోసం నైపుణ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ, డిజిటల్ పరిజ్ఞానం, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి అవసరం.

ప్రభుత్వాలు విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా పట్టణ విద్యార్థులతో సమానమైన అవకాశాలు అందాలి. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకూడదు. విద్యా హక్కు నిజంగా ప్రతి ఇంటి పిల్లల జీవితంలో వెలుగు నింపాలి.

తల్లిదండ్రులు కూడా పిల్లలపై మార్కుల ఒత్తిడి కాకుండా, వారి ఆసక్తి, సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. యువత కూడా సోషల్ మీడియాలో సమయం వృథా చేయకుండా, దాన్ని జ్ఞానం, ఉపాధి, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగించుకోవాలి. క్రమశిక్షణ, కృషి, మంచి ఆలోచన, సమాజంపై బాధ్యత - ఇవే యువతను నిజమైన విజయానికి తీసుకెళ్తాయి.

విద్య బలపడితే యువత బలపడుతుంది. యువత బలపడితే దేశం బలపడుతుంది. అందుకే విద్యను ఉద్యోగానికి మార్గంగా మాత్రమే కాకుండా, జీవితాన్ని మార్చే శక్తిగా చూడాలి. యువతను సరైన దారిలో నడిపించడం ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి ప్రభుత్వం, ప్రతి సమాజం బాధ్యత. విద్యలో మార్పు రావాలి. యువతలో దిశ రావాలి. అప్పుడు మాత్రమే సమాజంలో నిజమైన అభివృద్ధి కనిపిస్తుంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## విజయవాడ బైపాస్‌పై కబళించిన మృత్యువు..

### తల్లీకుమారుడి సహా ముగ్గురి దుర్మరణం



**గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ కొత్త బైపాస్‌పై బీబీ గూడెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ పంక్చరై అదుపుతప్పి ముందు వెళ్తున్న కారు, ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయిల్ ట్యాంకర్.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు, బైక్‌పై వెళ్తున్న ఒకరు మృతిచెందారు. గన్నవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కారులో మృతిచెందిన వారిని కైకలూరు మండలం పెంచికలమర్రుకు చెందిన తల్లి జయమంగళ నాగదుర్గ (28), ఆమె కుమారుడు కారుణ్య నాగసాయి (3)గా గుర్తించారు. నాగదుర్గ భర్త విజయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తూ మృత్యువాత పడిన వ్యక్తిని సింగ్‌నగర్‌కు చెందిన దాసరి వెంకటేశ్వరరావు (50)గా గుర్తించారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్ సరూర్‌నగర్‌లో భారీ పేలుడు.. ఇల్లు ధ్వంసం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సరూర్‌నగర్‌లో భారీ పేలుడు సంభవించింది. భారీ పేలుడు సంభవించి రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇల్లు ఒక్కసారిగా ధ్వంసమైంది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీల అద్దాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే, ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటన అనంతరం ఇంట్లోని గ్యాస్ స్టవ్, 3 గ్యాస్ సిలిండర్లు, ఫ్రిడ్జ్, గీజర్‌తోపాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించగా అవన్నీ సురక్షితంగా ఉండడం.. పేలుడు మిస్టరీగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళ్లు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్-4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి 24ఏళ్లుగా నివాసముంటున్నారు. అతని ఇంట్లోని కిచెన్‌లో ఈ ఘటన జరిగింది. నిపుణుల సాయంతో ఇల్లు ధ్వంసానికి గల కారణాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకొని కారణాలను అన్వేషిస్తున్నారు.

## చీరతో చేతులు కట్టేసి భర్తను నరికి చంపిన భార్య



**దేవరకద్ర, విశ్వం వాయిస్ న్యూస్ :** కడదాకా కలిసి ఉండాల్సిన భార్య.. కనికరం లేకుండా భర్త చేతులను చీరతో కట్టేసి.. కత్తితో అతికిరాతకంగా నరికి చంపిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరు నాగేశ్(38)కు, కోయిలకొండ మండలం మల్కాపూర్‌కు చెందిన కవితతో 17 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. కుటుంబమంతా సంతోషంగా ఉన్న సమయంలో భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలుసుకున్న భర్త పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించారు. అయినా ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో తాగొచ్చి ఆమెతో గొడవకు దిగేవారు. ఆదివారం రాత్రి కుమారులు నిద్రిస్తున్న సమయంలో.. కవిత చీరతో నాగేశ్ చేతులు కట్టేసి కత్తితో నరుకుతుండగా చిన్న కుమారుడు గమనించి కేకలు వేశాడు. శబ్దం విన్న చుట్టుపక్కల వారు ఇంటి తలుపు లు విరగొట్టి తెరిచారు. రక్తపు మడుగులో ఉన్న నాగేశ్‌ను జిల్లా ఆస్పత్రికి.. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందారు. మృతుడి సోదరుడు రాజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### విజయవాడ-హైదరాబాద్ రహదారిపై

## లారీ ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు



**కట్టంగూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లా కట్టం గూర్ మండలం ముత్యాలమ్మగూడెం వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమా దం జరిగింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సిమెంట్ లారీ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ట్రావెల్స్ బస్సు భీమవరం నుంచి హైదరాబాద్ వస్తుండగా టైరు పేలడంతో అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అంది స్తున్నారు. ఘటనపై కట్టంగూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్యాయత్నం

**ఆమదాలవలస గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కూర్మారపు వరలక్ష్మి తన ఇద్దరు చిన్నారుల పీక కోసి చంపేసింది. అనంతరం ఆమె కూడా పీక కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వరలక్ష్మిని 108లో శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

## 525 కిలోల గంజాయి పట్టివేత



**బూర్గంపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయిని ఈగల్ ఫోర్స్, పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు మండలం సారపాక వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.2.62 కోట్లుగా అంచనా వేశారు. కంటైనర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో గంజాయిని ముఠా దాచినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిశాలో సేకరించి యూపీకి తరలిస్తున్నట్లు తేల్చారు. ఈ ముఠాలోని బాలుడు సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కంటైనర్, బైక్, 5 సెల్‌ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మద్యం మత్తులో.. భార్యని చంపి భర్త ఆత్మహత్య



**మల్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం మత్తులో భార్యతో గొడవపడి క్షణికావేశంలో ఆమె గొంతు నులిమి చంపిన భర్త అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నూకపల్లికి చెందిన వోలెపు నాగరాజు(49), లక్ష్మి(45) దంపతులు 24 ఏళ్ల క్రితం ఇష్టపడి పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. వారికి సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం ఒక బాలుడిని దత్తత తీసుకున్నారు. అన్యోన్యంగా జీవనం సాగిస్తున్న ఆ దంపతుల మధ్య ఆదివారం రాత్రి గొడవ తలెత్తింది. దీంతో నాగరాజు మద్యం మత్తులో భార్యను కొట్టి పురుగుమందు తాగడానికి యత్నించగా.. తోపులాటలో లక్ష్మి, బాలుడి చేతులపై మందు పడింది. చివరికి నాగరాజు భార్య, కుమారుడు పడుకున్న మంచంలోనే ఆమె గొంతు నులిమి హతమార్చి.. అనంతరం తానూ ఉరి వేసుకున్నాడు. బాలుడు పెదనాన్న గంగాధర్‌కి విషయం చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచామిచ్చారు. నాగరాజు, లక్ష్మి దంపతులు తమకున్న వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ కూలీ పనులకు వెళ్లేవారు. తరచూ మద్యం మత్తులో నాగరాజు భార్యతో గొడవ పడుతుండేవాడని.. ఆవేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. మృతురాలి తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

# రాజమండ్రి “సెంట్రల్ జైల్” భద్రతకు ప్రమాదంగా మారుతుందా!

### ఆంధ్రప్రదేశ్ సినిమా టోపోగ్రాఫి మంత్రికి అవమానం - తమిళనాడు సినిమా షూటింగ్‌లకు “ఆహ్వానం”
### రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్, విశ్లేషణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జైలు నిబంధనలను అతిక్రమించి రాజమండ్రి సెంట్రల్ జైలు అధికార దుర్వినియోగ చర్యలకు కేంద్ర బిందువుగా మారిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసారు. ఈ మధ్య కాలములో యోగా డే సందర్బంగా సెంట్రల్ జైల్లో ఏర్పాటు చేసిన యోగా క్లాసెస్ కు ఉన్నత అధికారులు, ఆంధ్రప్రదేశ్ సినిమా టోగ్రాఫి మంత్రివర్యులు కందుల దుర్గేష్ అతిధులుగా హాజరైన కార్యక్రమంకు తోడుగా వచ్చిన సెక్యూరిటీ సిబ్బందిని సైతం జైలు ఆంక్షలు పేరుతో నిలువరించి మంత్రిని, ఉన్నత అధికారులను అవమానించినట్టుగా వార్తలు బగ్గు మన్నాయన్నారు. ఈ రోజు(30/6/2026) తమిళనాడు కు చెందిన వండర్ బార్ ఫిలిమ్స్ ప్రొడెక్షన్ మేనేజర్ ఎస్. యు. నాగేశ్వరావు సినిమా షూటింగ్ పేరుతో చేసుకున్న దరఖాస్తుకు నిబంధనలను అతిక్రమించి షూటింగ్ కు ఎలా అనుమతి ఇచ్చారు. అత్యంత హై సెక్యూరిటీ జోన్ అయినటువంటి రాజమండ్రి సెంట్రల్ జైల్ సినిమా షూటింగ్ కు అనుమతి ఇవ్వాలంటే జైలు సూపరింటెండెంట్, ఆ శాఖ అనుమతి ఒక్కటే సరిపోతుందా ! ప్రభుత్వంలో గల కీలక విభాగాల అనుమతి అక్కరలేదా ! అను ప్రశ్నకు జైలు అధికారులు సమాధానం చెప్పాలి. గత సంవత్సరం 7వ నెలలో జైలు ప్రక్కనే ఆనుకుని వున్నటు వంటి నారాయణపురం లో గల ఒక అపార్ట్మెంట్ టెర్రస్ నుండి ఒక విద్యార్థి తల్లిదండ్రులు ముద్దుగా కొనిచ్చిన డ్రోన్ కెమెరా జైలు ఆకాశ సరిహద్దు దాటి వచ్చిందని , జైలుకు పెద్ద ప్రమాదమే వాటిల్లినట్టు మా జైలు భద్రత కు అత్యంత ప్రమాదం జరగబోతుందని భావించిన జైలు అధికారి స్థానిక 1వ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయించి ఆ విద్యార్థి కుటుంబాన్ని తీవ్రమైన క్షోభకు గురించేశారు. నేడు తమిళనాడు సినిమా షూటింగ్ కు హీరో ధనుష్ , హీరోయిన్ సాయి పల్లవి, మరో అగ్ర నటుడు ముమ్ముట్టి హాజరైన రాజమండ్రి జైలు షూటింగ్ కు డ్రోన్ కెమెరా , 2 స్టిల్ కెమెరాలు, 2 పెద్ద అదునాతన కెమెరాలు , 40 అడుగులు క్రైన్, ఒక జిమ్మి క్రైన్ , ట్రాలీలు, ట్రాక్ ఎక్యూప్మెంట్ ఇలాంటి భద్రతా ప్రమాణాలకు ప్రమాదం కల్పించే మరి కొన్ని వాటికి ఎవరి ఆదేశాల మేరకు అనుమతులు ఇచ్చారు . ఆకాశ సరిహద్దు దాటి నందుకే ఒక విద్యార్థి డ్రోన్ ఎగుర వేసి నందుకు పోలీస్ కేసు నమోదు చేయించారు. అలాంటిది జైలు ప్రాగణం లోనే డ్రోన్ , ఇతర కెమెరా లకు అనుమతి ఇచ్చారు . ఇందుకు ప్రభుత్వం సుమోటో గా స్పందించి జైలు అధికారుల పై చట్ట పరమైన, శాఖా పరమైన చర్యలు తీసుకుంటుందా ! లేదా ! అత్యంత నిషేధిత ప్రాంతం అయిన రాజమండ్రి సెంట్రల్ జైలు ల్లోకి షూటింగ్ పేరుతో సుమారు 8 పెద్ద వాహనాలు, పెద్ద పెద్ద బ్యాగ్ లలో లగేజీలు సరైన చెక్కింగ్ లేకుండానే జైల్లోకి నిబంధనలను అతిక్రమించి పంపించారు. ఇది కాకుండా సుమారు 200 మంది క్రూ సిబ్బంది, 150 మంది జూనియర్ ఆర్టిస్ట్ లు, 10 ప్రధాన ఆర్టిస్టులు కు ఒక వారం రోజులు పాటు నైట్ షూటింగ్ లతో పాటుగా జైలును వండర్ బార్ ఫీలిమ్స్ ఆదినంలో తీసుకున్నారు . జైల్లో కి వెళ్లిన వాహనాలకు, ఇతర టెక్నీషియన్స్‌కు, జూనియర్ ఆర్టిస్ట్ లకు సమగ్ర పరిశీలన లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు కందుల దుర్గేష్, ఇతర అధికారుల భద్రత సిబ్బంది ని మాత్రం జైలు రూల్స్ అంటు అవమానించి జైలు అధికారులు ఆహాన్ని చాటుకున్నారు. ఈ మొత్తం సినిమా షూటింగ్ ఏర్పాట్లకు నిబంధనలను బేఖాతరు చేస్తు ఒక ఆమాత్యుడు చక్రం తిప్పినట్టు అనధికార వార్తలు గుప్పు మంటున్నాయి. ఈ మొత్తం షూటింగ్ కార్యక్రమం జైలు లో ఒక వారం పాటు నిర్వహించుకోవటానికి బారిగానే ముడుపులు ఒకరి నుండి ఒకరికి మారినట్టు విశ్వాసనీయ వర్గాల భోగట్టా అంటున్నారు. అత్యంత నిషేధిత ప్రాంతమైన రాజమండ్రి సెంట్రల్ జైలు వంటి కేంద్రంలో ఇలాంటి సినిమా షూటింగ్ లకు ఇతర కీలక ప్రభుత్వ విభాగాల అనుమతి కూడా తప్పనిసరిగా వుండాలి. వండర్ బార్ ఫిలిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సినిమా షూటింగ్ ను తక్షణమే రద్దు చేసి నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ లకు ఆదేశాలు జారి చేసిన జైలు అధికారులపై చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సిద్ధ పడాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు.

### ప్రజా సమస్యలు

## పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

### ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలుపై 38 వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పారదర్శకంగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల విభాగం ద్వారా అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెపిపి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు కూటమి పార్టీ నాయకులు, వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




బుధవారం, 01 జూలై, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత — www.viswamvoice.com




# ఇది మెయిన్ రోడ్డా..? లేక డంపింగ్ యార్డా..?

## ద్రాక్షారామంలో ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు

### ఇబ్బంది పడుతున్న భక్తులు, స్థానికులు

**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్:** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ భీమేశ్వర స్వామి పుణ్యక్షేత్రం ద్రాక్షారామంలో పారిశుధ్య నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తుంది. ప్రధాన రహదారుల పక్కనే చెత్త కుప్పలు పెరుకుపోవడంతో భక్తులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురమతున్నారు. దుర్వాసన, దోమలు, ఈగల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**మంత్రి నిర్ణయం.. అమలులో జాప్యం**

- పర్యాటకులు, భక్తుల సాకర్యార్థం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి **వాసంశెట్టి సుభాష్** చొరవతో గుడి వెనుక ఉన్న పాత డంపింగ్ యార్డును 3 కిలోమీటర్ల దూరంలోని ఆదివారపుపేట రోడ్డుకు తరలించారు. అయితే, గ్రామంలో సేకరించే చెత్తను అక్కడికి తరలించడంలో జాప్యం జరుగుతుండటంతో జనావాసాల మధ్యే వ్యర్థాలు పేరుకుపోతున్నారు.



అన్నయ్యపేట మెయిన్ రోడ్డు


వెంకటాయప్రాలెం వంతెన దగ్గర


వెంకటాయప్రాలెం వంతెన దగ్గర


అన్నయ్యపేట పంచాయతీ కార్యాలయం పద్ద

**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** దక్షిణ కాశీగా పేరుగాంచిన ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి పుణ్యక్షేత్రం పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రధాన రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడంతో భక్తులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం సంబంధిత యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

**మంత్రి గారి నిర్ణయం.. క్షేత్రస్థాయిలో అమలులో జాప్యం**

పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవ తీసుకుని.. గుడి వెనుక ఉన్న పాత డంపింగ్ యార్డ్‌ను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదివారపుపేట రోడ్డుకు మార్పించారు. అయితే, క్షేత్రస్థాయిలో సేకరించిన చెత్తను ఆదివారపుపేటకు తరలించడంలో జరుగుతున్న జాప్యం వల్ల జనావాసాల మధ్యే వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

**అన్నయ్యపేటలో పంచాయతీకి 20 అడుగుల దూరంలోనే..**

అన్నయ్యపేట గ్రామపంచాయతీ కార్యాలయానికి కేవలం 20అడుగుల దూరంలోనే మెయిన్ రోడ్డు పక్కన ప్లాస్టిక్ సీసాలు, పాత పరుపులు, వ్యర్థాలు భారీగా వేయడం వల్ల ఒక మినీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. ఒక పక్క వ్యాపార సముదాయాలు, ఇంకో పక్క ఆటో యూనియన్, సరిగ్గా ఎదురుగా రైతులు వచ్చే పాల కేంద్రం ఉన్నాయి. ఇలా నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు తిరిగే రద్దీ ప్రాంతంలో చెత్త రోడ్డు మీదకు వస్తుండటంతో ప్రయాణికులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

**వెంకటాయపాలెం వంతెనల దగ్గర కూడా అదే పరిస్థితి**

కేవలం మెయిన్ రోడ్డు మాత్రమే కాకుండా.. వెంకటాయపాలెం వంతెన దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో కూడా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఆదివారపుపేటలో వేయాల్సిన వ్యర్థాలను, నివాస ప్రాంతాల్లో వేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, తక్షణమే ఈ విధానాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**భక్తులకు అసౌకర్యం.. పుణ్యక్షేత్ర పవిత్రతకు విఘాతం**

ద్రాక్షారామం రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం విచ్చేసే పంచారామ క్షేత్రం. ప్రధాన రహదారి గుండా గుడికి వెళ్లే భక్తులకు ఈ చెత్త కుప్పల వల్ల కలిగే దుర్వాసన ఇబ్బందిగా మారుతోంది. పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రాంతంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.

**స్పందించిన పంచాయతీ అధికారి - ప్రజల విజ్ఞప్తి**

ఈ సమస్యపై సంబంధిత పంచాయతీ అధికారి సానుకూలంగా స్పందించారు. తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించానని, సమస్యను గుర్తించానని పేర్కొంటూ.. రానున్న రెండు రోజుల్లో ఈ చెత్తనంతా పూర్తిగా క్లియర్ చేసి రోడ్లను శుభ్రం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, భక్తులు అధికారులకు చిన్న విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారి ఇచ్చిన హామీ మేరకు వచ్చే రెండు రోజుల్లో ఈ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయాలని ఆశిస్తున్నారు. అంతేకాకుండా, ఇది తాత్కాలికంగానే కాకుండా నిత్యం సేకరించే వ్యర్థాలను జనావాసాల మధ్య వేయకుండా, నేరుగా ఆదివారపుపేట డంపింగ్ యార్డ్‌కే తరలించేలా ఒక శాశ్వత ప్రణాళికను అమలు చేయాలని కోరుతున్నారు. తద్వారా పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడటంతో పాటు, ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# డైట్‌లో కళా విద్యపై కార్యశాల



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ డైట్ కళాశాలలో 30 జూన్‌న కళావిద్య వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఛాత్రోపాధ్యాయులకు కళా మరియు సాంస్కృతిక విద్యలో భాగంగా నిర్వహించిన ఈ కార్యశాలలో విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల అధ్యాపకులు బి.రవికిరణ్ (వీణ వాయిద్యం) విషయ నిపుణులుగా పాల్గొన్నారు. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ చూడామణి, కళాశాల కళా విద్య కోఆర్డినేటర్లు ఎస్ రవికుమార్, పిఎస్‌విడి దుర్గ, కే ధర్మరాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఎం.రామకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బి రవి కిరణ్ సంగీతం ప్రాముఖ్యత, సంగీత కళాకారులు, నిత్యజీవితంలో సంగీత ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశ బోధనలో కూడా సంగీతం ఏ విధంగా ఉపయోగపడుతుందో ఉదాహరణాత్మకంగా తెలియజేశారు. . ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు నందు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా తమలోని సంగీత ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంతో

# శెట్టిబలిజలను ఉద్ధరిస్తానంటే ఎవరూ నమ్మరు

## భరత్ తీరుపై మండిపడిన టీడీపీ నేత చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎంపీగా ఉండగా శెట్టిబలిజలను పట్టించుకోని మార్గాని భరత్ ఇప్పుడు ఓడిపోయాక వారిని ఉద్ధరిస్తానంటే ఎవరూ నమ్మరని టీడీపీకి చెందిన శెట్టిబలిజ నాయకుడు చెల్లుబోయిన సూర్య నారాయణమూర్తి మండిపడ్డారు.భరత్ పక్కన ఉండే పీతా రామకృష్ణ అనే రౌడీ షీటర్ పై రెవెన్యూ, పోలీసు అధికారులు పి.డి.యాక్టు నమోదు చేస్తే ఆ సంఘటనను అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వల్ల శెట్టిబలిజలకు అన్యాయం జరిగిపోతోందని రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. రాజమండ్రి సిటీలో12 మందిపై పి.డి.యాక్టు పెట్టారని,అందులో ఇద్దరు శెట్టిబలిజ కులస్తులు ఉన్నారని,అయితే పి.డి.యాక్టు ఎవరిపై పెడతారు. ఎందుకు పెడతారనేది గతంలో ఎంపీగా చేసిన భరత్ కు తెలియకపోవడం సిగ్గు చేటన్నారు.కలెక్టర్,పోలీసు అధికారుల స్థాయిలో ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణకు ఇటువంటి చర్యలు తీసుకుంటుందని అన్నారు. భరత్ ఎంపీగా ఉండగా రాజమండ్రి సిటీ నియోజక వర్గంలోని 42 వార్డుల్లోను శెట్టిబలిజ కులస్తులకు తీవ్ర అన్యాయం చేశాడని చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి ధ్వజమెత్తారు.భరత్ వల్ల ఎంతోమంది నష్టపోయారని విమర్శించారు.కదలి వెంకటేశ్వరరావు బెంగతో చనిపోవడానికి కారణం భరత్ అని,ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు భరత్ చేపట్టలేదని మండిపడ్డారు.పైగా రౌండ్ టేబుల్ సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును ఉద్దేశించి వాడు వీడు అని భరత్ అమర్యాదగా మాట్లాడడం సమంజసం కాదని చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి హితవు పలికారు.రౌడీ షీటర్ పై పి.డి.యాక్టు పెడితే దానిని అడ్డంపెట్టుకుని కుల రాజకీయం చేయాలను కోవడం మంచి పద్ధతి కాదని దీన్ని శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నేతగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# నిరుపేదల పాలిట ఆరోగ్య ప్రదాయిని సీఎం సహాయ నిధి

## రామచంద్రపురంలో 29 మందికి రూ.15.25 లక్షల చెక్కుల పంపిణీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 29 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.15.25 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కే గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నాయకులు చిన సుబ్బారావుకు ఆరే రాము పరామర్శ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం స్థానిక బొమ్మూరు ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు ఉద్యమ సీనియర్ నాయకులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు స్వగృహానికి మాల మహానాడు రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఆరే. రాము చేరుకుని ఇటీవల అల్లూరు సీతారామరాజు జిల్లా గంగవరం దాటిన తర్వాత చిన్నంటిపల్లి వద్ద కారు లోయలో పడి ప్రమాదంలో గాయాలతో బయటపడి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న చిన్న సుబ్బారావుని పరామర్శించారు. రాము చిన్న సుబ్బారావు ను వైద్యం కొరకు అడిగి తెలుసుకున్నారు. రాము మాట్లాడుతూ సుబ్బారావు అన్న త్వరగా కోలుకుని ఉద్యమాల్లో ముందుకి వెళ్ళాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

# హాస్టల్ భవనానికి స్థలం కేటాయించాలి

## దేవీపట్నం తహసిల్దార్‌కి వినతి పత్రాలు అందజేసిన ఆదివాసీ జేఏసీ నాయకులు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలంలోని మండల మెజిస్ట్రేట్, తహసిల్దార్ కె.సత్యనారాయణకి దేవీపట్నం మండలంలోని పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపుకు గురైన దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, అలాగే దండంగి, గంగంపాలెం, మూలపాడు, తొయ్యేరు గ్రామాల ప్రజలకు మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కావున మంచినీటి ట్యాంకులు ద్వారా ఐన మంచినీళ్లు అందించాలని,అలాగే పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా సర్వం కోల్పోయిన నిర్వాసితులందరికీ భూములు ఆన్లైన్ చేయాలని మరియు పోలవరం నిర్వాసితులు ప్రస్తుతం భూములు ఆన్లైన్ కానీ రైతులు ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ జిరాక్స్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి విత్తనాలు తీసుకోవడానికి పర్మిషన్ లెటర్ ఇప్పించాలని తెలియజేయడం జరిగింది.ఈ పై సమస్యలపై మండల మెజిస్ట్రేట్ అండ్ తాసిల్దార్ కె.సత్యనారాయణ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల రైతులకు ప్రొసిడింగ్ ఆర్డర్ కాపీ జిరాక్స్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చినట్టు అయితే వరి ధాన్యం విత్తనాలు ఇచ్చేందుకు పర్మిషన్ ఇస్తామని తాసిల్దార్ గారు హామీ ఇచ్చారు.పోలవరం నిర్వాసితుల రైతులందరూ వరి ధాన్యం విత్తనాలు పర్మిషన్ కొరకు దేవీపట్నం తాసిల్దార్‌ని సంప్రదించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శరభవరం,దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర,మాజీ సర్పంచ్ సోదే వెంకన్న దొర,తెల్లం కామన్న దొర,మిర్తివాడ వీరబాబు రెడ్డి,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు మొదలైన వారు పాల్గొన్నారు.

స్వదేశానికి రాగానే

# ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్న కంబాల శ్రీనివాసరావు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న వెంటనే ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గత నెల 21వ తేదీన అమెరికా పర్యటనకు వెళ్లిన ఆయన తిరిగి గోకవరానికి చేరుకున్న అనంతరం ముందుగా ప్రజల సమస్యలపై ఆరా తీశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గ్రామాల్లో ఉన్న సమస్యలపై తన సిబ్బందితో వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ "నాకు ప్రజలే ముఖ్యం. ప్రజల కోసం ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటాను. ప్రజా సేవే నా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో కోట్ల రూపాయల వ్యయంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ఆయన, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పం వ్యక్తం చేశారు. అలాగే ప్రజల అవసరాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అవకాశం లభిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన తెలిపారు. స్వదేశానికి చేరుకున్న వెంటనే ప్రజల సమస్యలపై దృష్టి సారించిన కంబాల శ్రీనివాసరావు తీరును పలువురు స్థానికులు అభినందిస్తున్నారు.

# టెట్ మెటీరియల్ ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యుటిఎఫ్, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల సౌకర్యార్థం రూపొందించిన ఎ.పి.టెట్ మెటీరియల్‌ను జిల్లా యూటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు చేతుల మీదుగా వారి కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఉపాధ్యాయులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని,బిజిలి ఐస్ ఫ్యాక్టరీ దగ్గర గల యూ టి ఎఫ్ నగర కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని జిల్లా అధ్యక్షులు ఇవిఎస్ఎన్ఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ షరీఫ్, సహాధ్యక్షులు జె.రూఫస్ రావు, జిల్లా కార్యదర్శులు దయానిధి రమేష్ బాబు, మొండ్రేటి నరేష్, కె.ప్రకాష్ రావు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



### రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులకు

# శంకుస్థాపన చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్

## రెండేళ్లలో రూ.50 కోట్లతో రామచంద్రపురం పట్టణ అభివృద్ధి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్ రాజు, డిఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గడచిన రెండేళ్ల పాలనలో రామచంద్రపురం పట్టణంలో రూ.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రామచంద్రపురం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. వైసీపీకి విష ప్రచారం తప్ప అభివృద్ధి కానరావడం లేదని, వాళ్ళు కళ్ళు లేని కబోదులులా వ్యవహరిస్తున్నారని మంత్రి విమర్శించారు. అవసరమైతే వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు చేయించి పింఛన్లు మంజూరు చేయిస్తామని చమత్కరించారు. చెప్పుకునేందుకు ఏం లేక, ప్రజలు ఛీకొట్టినా బుద్ధి మార్చుకోకుండా బురదజల్లే పనిలో నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మంత్రి సుభాష్ కృషితో రామచంద్రపురం పట్టణం గతంలో లేని విధంగా అభివృద్ధి జరిగిందని, రానున్న మాసాల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయని వెల్లడించారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించినప్పటికీ, నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్ల త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే తనిఖీల్లో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును పరిశీలించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ వ్యవస్థలను తనిఖీ చేసి అనంతరం పర్యవేక్షణ రిజిస్టరులో సంతకం చేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్రమం తప్పకుండా తనిఖీ చేసి సమగ్ర నివేదికలను అందిస్తున్నామని తెలిపారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ద్వారా 24 గంటలూ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పటిష్ట నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం గోదాము వద్ద అమలవుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున వడ్డీ నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ తరపున డి. రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సతీష్, తహసీల్దార్ సుభాష్, శివరాజు, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ నేతలతో మంత్రి సుభాష్ ఆత్మీయ సమావేశం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని కార్మిక, కర్మాగార, బాయిలర్స్ & వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నివాసంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పార్టీ కమిటీలు, అభివృద్ధి కార్యక్రమాలపై కీలక చర్చలు జరిగాయి. ప్రత్యేక సమావేశంలో ముమ్మిడివరం నియోజకవర్గ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు,వేగుళ్ల జోగేశ్వరరావు,బండారు సత్యానందరావు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కోనసీమ జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి,జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పళ్లంరాజు, మోకా ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### వీణా నాదంలో ఇందుపల్లి యువతికి

# రెండు వరల్డ్ రికార్డులు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన పేరి ఫణి కుమారి వీణా వాయిద్యంలో విశేష ప్రతిభ కనబర్చి రెండు వరల్డ్ రికార్డులు సాధించి ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని రెండు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ 45వ వార్షికోత్సవం సందర్భంగా దివ్య సాయి వీణా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టోత్తర శత వైణిక నాద యజ్ఞం కార్యక్రమంలో వీణా వాయించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెమెంటోలను విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞ శర్మతో పాటు పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సరయు మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన గ్రాండ్ వీణా కార్యక్రమంలో పాల్గొని మరో వరల్డ్ రికార్డును సాధించారు. వీణా వాయిద్యంలో విశేష ప్రతిభ కనబర్చి రెండు ప్రపంచ రికార్డులు సాధించిన ఫణి కుమారిని పలువురు అభినందించారు.

### గణిత అధ్యాపకురాలు

# వై.పద్మజ ఘన పదవీ విరమణ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపకురాలు వై.పద్మజ ఆత్మీయ పదవీ విరమణ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తన సుదీర్ఘ సేవా కాలంలో పద్మజ గణిత బోధనలో విశేష కృషి చేసి వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని, క్రమశిక్షణ, అంకితభావం, విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలతో అధ్యాపక వృత్తికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. గణిత శాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతి అందించేందుకు పద్మజ లక్ష రూపాయలను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయడం ఆమె దాతృత్వానికి నిదర్శనం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యం ఫౌండేషన్ ప్రతినిధి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధతను, సమాజం పట్ల బాధ్యతను కొనియాడుతూ ప్రతి ఒక్కరూ తమ వృత్తి పట్ల నియమ నిబంధనలు కలిగి ఉండాలని సూచించి, పద్మజను ఘనంగా సత్కరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి గొప్పతనాన్ని వివరించి సమాజంలోని లోపాలను సరిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సహచర అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పద్మజ సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం కూడా ఆమె ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్.వి. రమణ నేతృత్వంలో పద్మజను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం పద్మజ తన అనుభవాలను పంచుకుంటూ, అధ్యాపక వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేయాలని యువ అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోదండ రామయ్య పద్మజపై ఒక గేయం రాసి పాడారు. ఈ సభలో రంపచోడవరం విశ్రాంత ఉద్యోగి సువర్చల, ఏఎస్డీ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మాజీ మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్ తోట అమ్మాజీ, కృత్తివేంటి పేర్రాజు పంతులు ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ మార్ని వీర్రాజు, చైర్మన్ సలాది వెంకటప్ప నాయుడు, బోర్డు సభ్యులు సిరిగినీడి ప్రసాద్, ఏ. సత్యనారాయణ, రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కంచుమర్తి బాబురావు, ఫణి కుమార్, హై స్కూల్ హెచ్ఎం వీర రాఘవ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. నాగ శ్రీనివాస్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

### జనసైనికులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంటు పరిధిలో జనసేన పార్టీ నిర్మాణ సారథుల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణకు జనసైనికుల నుంచి విశేష స్పందన లభించింది. అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలోని ఎర్రవంతెన సమీపంలోని శ్రీ వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల నుంచి నిర్మాణ సారథుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంకల్పం, పార్టీ లక్ష్యాలను వివరించి, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాతపూర్వక సూచనలు అందించాలని కోరారు. పార్టీలో అనుభవం కలిగిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై దరఖాస్తులు సమర్పించగా, తొలి రోజు సుమారు 50 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల జనసేన నాయకులు, కార్యకర్తలతో పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జూలై 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలాపురంలోని వెంకటరమణ కన్వెన్షన్ హాల్‌లో కొనసాగుతుందని అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు పంచకర్ల రమేష్ బాబు తెలిపారు.

# కాట్రేనికోన అడిషనల్ ఎస్సైగా విప్పర్తి సత్యనారాయణ బాధ్యతల స్వీకారం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్ఐగా విప్పర్తి సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విప్పర్తి సత్యనారాయణ గతంలో కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ప్రజలకు చేరువైన అధికారిగా గుర్తింపు పొందారు. అనంతరం ఎస్ఐగా పదోన్నతి పొందిన ఆయన పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆయనఅభ్యర్థన మేరకు ఉన్నతాధికారులు తిరిగి కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌కు అడిషనల్ ఎస్ఐగా నియమించారు. దీంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు చట్ట పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

### శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి

# ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించిన మెట్ల



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం, కొమ్మరగిరిపట్టణంలో శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పరిశీలించారు. అనంతరం ఆలయ ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పట్టణ తెలుగు యువత నాయకులు నల్లా మల్లిబాబు, టీడీపీ నాయకులు యాళ్ల భాస్కరరావు, మెట్ల రామమూర్తి సొసైటీ సీ.ఈ.ఓ. కొమ్మూరి సత్తిబాబు, గునిశెట్టి రోహిణి కుమార్, సంగీతం తాతాజీ, ఆకుల రాము నిమ్మకాయల సుబ్బారావు, లక్కింశెట్టి నీలాకంటేశ్వరరావు, కొమ్ముల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల ప్రజా సేవకు గుర్తింపు

### గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా యాళ్ల దొరబాబు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన యాళ్ల వెంకట రామమోహనరావు (దొరబాబు)కు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనకు పార్టీ అప్పగించిన ఈ నూతన బాధ్యత పట్ల హర్షం వ్యక్తం చేశారు.వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన యాళ్ల వెంకట రామమోహనరావు, దాదాపు 25 సంవత్సరాలుగా ప్రజా సేవలో చురుకుగా కొనసాగుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సేవలందించారు.అల్లవరం మండలం నుంచిగ్రాజ సభ్యుడిగా ఎన్నికై ఆర్థిక, డ్వామా కమిటీలలో సభ్యునిగా పనిచేశారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పాటు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆయన విశాఖ ఇన్‌ఛార్జ్‌గా కూడా పార్టీ విస్తరణకు కృషి చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి తన రాజకీయ ప్రస్థానాన్ని మరింత విస్తరించారు. రాజకీయ అనుభవం, ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తున్న యాళ్ల వెంకట రామమోహనరావు గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా కూడా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

# పీఎంశ్రీ పాఠశాలలు రోల్‌మోడల్స్‌గా నిలవాలి




**హసన్ బాద, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పాఠశాలలు మిగిలిన పాఠశాలలకు రోల్ మోడల్స్‌గా నిలవాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి, పీఎంశ్రీ స్కూల్స్ జిల్లా నోడల్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని హసన్‌బాద పీఎంశ్రీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, డిజిటల్ ఎడ్యుకేషన్ తదితర సౌకర్యాలతో పాటుగా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, తరగతి గదుల నిర్మాణం, లైబ్రరీ, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ ల్యాబ్స్ నిర్మాణం, పరికరాల మంజూరు, లైబ్రరీ రూమ్స్ నిర్మాణం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పీఎంశ్రీ పాఠశాలల్లో 21 ఇండికేటర్స్ ఆధారంగా వాటి పనితీరును రివ్యూ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల వారి పర్యవేక్షణలో జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీల ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై రివ్యూ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 28 పీఎంశ్రీ పాఠశాలలను భౌతికంగా సందర్శించి రివ్యూ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్స్, పాల్ ల్యాబ్, అభివృద్ధి చేసిన ఆట స్థలాలను ఆయన పరిశీలించారు. పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని ఉండూరు, హసన్‌బాద మోడల్ ప్రైమరీ పాఠశాలలను సందర్శించి, స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్ అమలు తీరును పరిశీలించారు.

### ఇంటర్ విద్యార్థిని నేలపాటి ఇవాంజిలిన్‌కు

# షైనింగ్ స్టార్ అవార్డ్ ప్రదానం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన 2026 షైనింగ్ స్టార్స్ (ఇంటర్మీడియట్)అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నేలపాటి ఇవాంజిలిన్ అవార్డును అందుకుంది. ఎస్‌కేపీ గవర్నమెంట్ నేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 987/1000 మార్కులు సాధించిన ఇవాంజిలిన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆమెకు ల్యాప్‌టాప్, ప్రశంసాపత్రం, బంగారు పతకం బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు. విశేష ప్రతిభ కనబరిచిన ఇవాంజిలిన్.. మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఇంత సంతోషం రెండవ కుమార్తె నేలపాటి సుజాత కూతురు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం.. కేసు నమోదు




**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన కాట్రేనికోన అడవిపేటకు చెందిన వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు ఉప్పలగుప్తం ఎస్ఐ జానీ భాష మంగళవారం తెలిపారు. నిందితుడు ఎస్.యానానికి చెందిన ప్రశాంత్ నుంచి రూ. 4 లక్షలు తీసుకుని ఇజ్రాయెల్లో కష్టతరమైన పనిలో పెట్టాడని, అలాగే సరిపల్లికి చెందిన శాంతి శేఖర్ వద్ద రూ. 1.50 లక్షలు వసూలు చేసి టూరిస్ట్ వీసా మాత్రమే ఇచ్చి మోసం చేశాడని ఫిర్యాదులు అందాయన్నారు.

# బైకు దొంగ అరెస్టు : ఉప్పలగుప్తం ఎస్ఐ



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** బైకు దొంగతనానికి పాల్పడిన బలసాడి దుర్గాప్రసాద్ను అరెస్టు చేసినట్లు ఉప్పలగుప్తం ఎస్ఐ షాఖ జానీ భాష మంగళవారం తెలిపారు. బాధితుడు కుంచే హేమ మురారి ఈ నెల 26న యానం బీచ్ వద్ద పార్క్ చేసిన తన బైకు చోరీకి గురైందని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి దొంగిలించిన మోటార్ బైకును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

# కాకినాడలో ఘరానా మోసం

## స్టాక్ మార్కెట్ పేరుతో మోసపోయిన ప్రజలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జేఎన్‌టీయూ స్టేడియం రోడ్డులో, డీఎస్‌పి కార్యాలయానికి ఎదురుగా ఉన్న 'కేఆర్కే ప్లాజా' అపార్ట్‌మెంట్‌లో 'జెనెసిస్' అనే పేరుతో ఒక బోగస్ కంపెనీని ఏర్పాటు చేశారు.? మోజెస్ అనే వ్యక్తి ద్వారా ఈ ప్రాసెస్ నడుస్తుందని మోసపోయిన ప్రజలు ఆరోపించారు. ఈ కంపెనీలో సుమారుగా 7000 మంది ఉండొచ్చని అంచనా. ఈ కంపెనీ వారు తాము స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తామని, తమ వద్ద పెట్టుబడి పెడితే ఊహించని రీతిలో అధిక లాభాలు అందిస్తామని అమాయకమైన ప్రజల వద్ద ఈ సంస్థ నిర్వాహకులు నమ్మబలికారు. లక్ష రూపాయలకు లక్ష రూపాయలు అంటూ ఆశ చూపించారు. కాకినాడ అచ్చంపేట జంక్షన్ దగ్గర మా సంస్థకు కొన్ని విలువైన భూములు ఉన్నాయని తెలిపారన్నారు. కాకినాడ చుట్టుపక్కల గల గ్రామస్తులందరూ ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. వీరి మాటలు నమ్మిన స్థానిక ప్రజలు, వ్యాపారులు మరియు ఉద్యోగస్తులు తమ కష్టార్జితాన్ని లక్షల రూపాయల రూపంలో ఈ జెనెసిస్ కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. మనం మోసపోతున్నామని గ్రహించిన కస్టమర్లుకు కొన్ని నెలల నుండి వేధింపులు మొదలు అయ్యాయి. వారు పెట్టుబడి పెట్టిన డబ్బులు గానీ, లాభాలు గానీ ఇవ్వకుండా వాళ్లని నమ్మించి అదిగో ఇదిగో అంటూ కస్టమర్లను మభ్యపెట్టుకుంటూ వస్తున్నారు. మంగళవారం నాడు సుమారు 200 మందికి పైగా బాధితులు తమ డబ్బుల కోసం కంపెనీ దగ్గర ఉదయం నుండి సాయంత్రం వరకు రోడ్లమీద ఉన్నారు. సంస్థ నిర్వాహకులు జూన్ రెండో తారీఖున వస్తామని చెబుతుండగా, ఇలా ఎన్నోసార్లు మమల్ని మోసం చేశారని ఆందోళన చేశారు. నిర్వాహకులు వారిని మానసికంగా వేధిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ జెనెసిస్ కంపెనీ చుట్టూ ఎంత తిరిగినా పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్న బాధితులు, ఈ మోసపూరిత కంపెనీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని పోలీసులను, ఉన్నతాధికారులనుఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

# కాకినాడ మెడికవర్ హాస్పిటల్‌లో డయాలసిస్ ప్రారంభం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ మెడికవర్ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని మంగళ వారం బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు మరియు అత్యాధునిక వైద్య సదుపాయాలను తక్కువ ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన డయాలిసిస్ విభాగం ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన చికిత్స అందుతుందని, ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యం నందికోళ్ల అంజిబాబు మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు, బీజేపీ ప్రతినిధి నాని, మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈక్విప్డ్ పవర్లొఫ్టింగ్ పోటీల్లో

# గొల్లపాలెం యువకుడి సత్తా

## సిల్వర్ మెడల్ దక్కించుకున్న కుమార్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల హైద్రాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి ఈక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ డెడ్ లిఫ్ట్ విభాగంలో గొల్లపాలెం ఐరన్ ఫిట్నెస్ జిమ్ లో శిక్షణ పొందుతున్న కెడిఎస్ కుమార్ వెండి పథకం (సిల్వర్ మెడల్) సాదించి సత్తా చాటాడు. ఈ మేరకు మంగళవారం గొల్లపాలెంలో ఐరన్ ఫిట్ నెస్ జిమ్లో జిమ్ నిర్వాహకులు, స్థానికులు కెడిఎస్ కుమార్ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిఎన్ఎఫ్ పౌండేషన్ గౌరవాధ్యక్షురాలు, బందనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి తదితరులు హాజరై విజేతను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన కుమార్ ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పవర్ లిఫ్టింగ్ లో సత్తా చాటిన కుమార్ ను, కోచ్ ని పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మేడిశెట్టి రామకృష్ణయ్య, వైఎస్సార్సీపీ మేధావులఫొరం నియోజకవర్గ కన్వీనర్ తాడి వాసురెడ్డి, పార్టీ మండల బూత్ కమిటీల కన్వీనర్ పోతురాజు బాబురావు, జగతా నాగబాబు, జిమ్ కోచ్ లు షారుణ్, బాల సాయి శరన్, మహేష్, కృష్ణ తదితరులు విజేత రెడిఎస్ కుమార్ అభినందించారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండాలి

## సుప్రీం కోర్టు తీర్పును ఉప సంహరించుకోవాలి

## 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డరును రద్దు చేయాలి – దళిత నాయకుల డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మతం మారినంత మాత్రాన కులం మారదని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండాలని ప్రముఖ దళిత నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలోని హోలీ ట్రినిటీ చర్చి ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో "రాజ్యాంగాన్ని కాపాడదాం" అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. పలువురు ప్రముఖ దళిత నాయకులు హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బద్దే జార్జి ఆంటోని మాట్లాడుతూ మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులోని 3 వ పేరా ప్రకారం ఎస్సీలు హిందూ మతస్తులుగా ఉంటేనే ఎస్సీ స్టేటస్ దక్కుతుందని ,తర్వాత మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వబడతాయని అనడం మత స్వేచ్ఛకు భంగం కలిగించడమే కాకుండా రాజ్యాంగ హక్కులు కాలరాయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. పుట్టుకతో వచ్చే కులం మారదని, మతం విశ్వాసం, సామాజిక మార్పులతో కూడినదని, రిజర్వేషన్లు అంటరానితనం వలన అత్యాచారాలపై ఇచ్చినవని ఆయన గుర్తు చేశారు. బుద్దులు, సిక్కులు. షెడ్యూల్ తెగలవారిని రాజకీయ మార్పుల కోసం ఎస్సీలుగా గుర్తించారని, కాని ఎస్సీలను వారి హక్కులకు దూరం చేయలనుకోవడం మనువాద సిద్ధాంతమని రాజ్యాంగ నిర్మాత ఆంబేద్కర్ ఆనాడే గ్రహించారని, అందుకే ఆర్టికలు 24,28,14,15,16లో మాట్లాడే హక్కు, జీవించే హక్కు మత స్వేచ్ఛహక్కు కల్పించారని జార్జి ఆంటోని వివరించారు. మూడు దశాబ్దాల క్రితం నియమించిన రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక మరుగున పడేశారని, ఇప్పుడు జస్టిస్ బాలకృష్ణ కమిషన్ వేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు మాట్లాడుతూ మత స్వేచ్ఛను కాపాడాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దవుతుందన్న సుప్రీం కోర్టు తీర్పును ఉప సంహరించుకోవాలని కోరారు. తంబా జాన్ బాబు మాట్లాడుతూ 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డరును రద్దు చేయాలని, మతం మారినా ఎస్సీ హోదా కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రిటైర్డ్ ఎంఈఓ జి.వరప్రసాద్, కుసుమ రాజకుమారి, కుసుమ సాయిబాబా మాట్లాడుతూ ఇది దళితుల హక్కులపై జరుగుతున్న దాడి అని ఆవేదనచెందారు. ఈ సమావేశంలో దళిత నాయకులు నక్కా వెంకటరత్నం రాజు, పాము బాబురావు, చింతల జయప్రసాద్, మోహన్, టి.ఎస్.ప్రభాకరరావు, సిహెచ్ రత్నం, యు.చంద్రరావు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 98.50% మందికి పోలియో చుక్కలు : డిఎంహెచ్‌వో



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 98 50% మందికి పోలియో చుక్కలు వేశామని డిఎంహెచ్‌వో దుర్గారావు దొర తెలిపారు. అంబాజీపేట బస్టాండ్‌లో నిర్వహిస్తున్న ట్రాన్సిట్ బూతును మంగళవారం పరిశీలించారు. అనుకున్న లక్ష్యాన్ని నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన అవశ్యకత ఉందన్నారు. పోలియో చుక్కలు వేసిన చిన్నారులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సిద్ధార్థ రాయ్, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదనే ధ్యేయం కాదు.. సేవ చేయడంలోనే సంతృప్తి

క్యాపిటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయకుమార్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** "వైద్యం అనేది వ్యాపారం కాదు... ప్రాణాలను కాపాడే పవిత్రమైన సేవ" అనే భావనను ఆచరణలో నిరూపిస్తూ అమలాపురంలోని క్యాపిటల్ హాస్పిటల్ ప్రధాన ఆర్థోపెడిక్ వైద్యుడు డా. విజయ్ కుమార్ వేలాది మంది నిరుపేదలకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు. నేటి కాలంలో కార్పొరేట్ వైద్య విధానం, అధిక వైద్య ఖర్చులతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, కేవలం రూ.10 ఓపీ ఫీజుతో వైద్య సేవలు అందిస్తూ నిజమైన వైద్య ధర్మాన్ని చాటుతున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన తోటి వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూనే, గత రెండున్నర సంవత్సరాలుగా అమలాపురం, పరిసర ప్రాంతాల ప్రజలు తనపై చూపిస్తున్న విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదాలే తనను మరింత సేవ చేయడానికి ప్రేరేపిస్తున్నాయని భావోద్వేగంగా పేర్కొన్నారు.

**తల్లి ఆశయమే సేవా కార్యక్రమాలకు మూలం**

తన జీవితంలో చేస్తున్న ప్రతి మంచి పనికి, ప్రతి సేవకు తన తల్లి నక్కా వెంకట లక్ష్మి ఆశయమే స్ఫూర్తి అని డా. విజయ్ కుమార్ తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి వైద్యం అందుబాటులో ఉండాలనే తన తల్లి కోరికను నెరవేర్చాలనే సంకల్పంతో క్యాపిటల్ హాస్పిటల్ ద్వారా ప్రత్యేక సేవా కార్యక్రమాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. "డబ్బు లేక ఒక పేద మనిషి చికిత్సకు దూరం కాకూడదు. పేదవారికి కూడా మంచి వైద్యం అందాలి" అనే తల్లి ఆలోచనను తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నానని చెప్పారు. అందుకే గత రెండున్నర సంవత్సరాలుగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, వితంతువులు, నిరాశ్రయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నిరంతరం మందులు వాడాల్సిన నిరుపేదలకు కేవలం రూ.10 ఓపీతోనే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

**ఐదు వేల మందికి పైగా నిరుపేదలకు ఊరట..**

ఈ సేవా కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు దాదాపు ఐదు వేల మందికి పైగా నిరుపేదలు ఈ పథకం ద్వారా వైద్య సేవలు పొందినట్లు ఆయన వెల్లడించారు. కేవలం ఫీజు తగ్గించడం మాత్రమే కాకుండా, ప్రతి రోగిని కుటుంబ సభ్యుడిలా భావించి చికిత్స అందించడం క్యాపిటల్ హాస్పిటల్ ప్రత్యేకతగా నిలుస్తోందన్నారు. తమ ప్రాంతాల్లో అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరంగా ఉన్నవారు ఉంటే వారికి ఈ సేవ గురించి తెలియజేసి ప్రయోజనం పొందేలా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**"ఆరోగ్యమే మహాభాగ్యం" – ఆరోగ్యమే నిజమైన సంపద**

డాక్టర్స్ డే సందేశంలో ప్రజలకు ఆరోగ్యంపై విలువైన సూచనలు చేసిన డా. విజయ్ కుమార్, మన పెద్దలు చెప్పిన "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూక్తి జీవితాంతం గుర్తుంచుకోవాల్సినదని అన్నారు. మనిషి ఎంత సంపాదించినా ఆరోగ్యం లేకపోతే ఆ సంపదకు విలువ ఉండదని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ బాధ్యతలు, సామాజిక బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించగలమని వివరించారు.

**ఎముకల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు**

ఆర్థోపెడిక్ వైద్యుడిగా ప్రజల్లో ఎముకల ఆరోగ్యంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చాలామంది తీవ్రమైన నొప్పులు వచ్చిన తర్వాత లేదా ఎముకలు బలహీనపడిన తర్వాతే వైద్యులను సంప్రదిస్తున్నారని, అప్పటికే చికిత్స క్లిష్టంగా మారుతుందని చెప్పారు. గుండె పరీక్షలు, షుగర్ పరీక్షలు చేయించుకున్నట్లే 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా బోన్ డెన్సిటీ, క్యాల్షియం, విటమిన్–డి3 పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందుగానే సమస్యలను గుర్తిస్తే భవిష్యత్తులో వచ్చే అనేక ఎముకల వ్యాధులను నివారించే అవకాశం ఉంటుందని వివరించారు.

**క్యాపిటల్ హాస్పిటల్... సేవకు మరో పేరు**

క్యాపిటల్ హాస్పిటల్‌లో వైద్యం అంటే కేవలం రోగాలకు చికిత్స మాత్రమే కాదని, ప్రతి రోగిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం కూడా తమ బాధ్యతగా భావిస్తున్నట్లు డా. విజయ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అందుబాటులో, ఆప్యాయతతో, నమ్మకాన్ని కలిగించే వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య రంగంలో మానవత్వం నిలిచి ఉండాలంటే సేవా భావం తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

**వైద్యసేవలతో పాటు సామాజిక సేవలు**

వైద్య సేవలకే పరిమితం కాకుండా, తన తల్లి పేరుతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డా. విజయ్ కుమార్ వెల్లడించారు. అనాథ శరణాలయాలకు విరాళాలు అందించడం, అవసరమైన వారికి చేయూత ఇవ్వడం వంటి కార్యక్రమాల ద్వారా తనవంతుగా మానవతా విలువలను చాటుతున్నామని చెప్పారు. తాను చేస్తున్న ప్రతి సేవ వెనుక తన తల్లి ఆశీస్సులు, ప్రజల ప్రేమ, దేవుని అనుగ్రహమే కారణమని వినయంగా పేర్కొన్నారు.

**ఆదర్శ వైద్యుడిగా ప్రశంసలు**

నేటి పరిస్థితుల్లో వైద్య వృత్తిని సేవా మార్గంగా కొనసాగిస్తూ వేలాది మంది పేదలకు ఆశాకిరణంగా నిలుస్తున్న డా. విజయ్ కుమార్ సేవలను అమలాపురం ప్రాంత ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. తల్లి ఆశయాన్ని జీవిత ధ్యేయంగా మార్చుకుని క్యాపిటల్ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ఆయన, వైద్య వృత్తికి ఉన్న గొప్పతనాన్ని మరోసారి సమాజానికి చాటుతున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ఇచ్చిన ఆరోగ్య సందేశం, పేదల పట్ల చూపుతున్న మానవతా దృక్పథం, తల్లి ఆశయాన్ని నిలబెట్టేందుకు చేస్తున్న సేవా యజ్ఞం మరెందరో వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పంచాయతీ ఎన్నికలు : డబ్బు కాదు... అభివృద్ధికే ఓటు

విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం..

**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ పాలనకు పునాది అయిన పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈసారి గత ఎన్నికలతో పోలిస్తే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. యువతతో పాటు చదువుకున్న కొత్త ముఖాలు కూడా ప్రజాసేవ లక్ష్యంగా పోటీకి ఆసక్తి చూపడం విశేషం. అయితే ఎన్నికలు అంటే కేవలం గెలుపు–ఓటమి మాత్రమే కాదు. గ్రామ భవిష్యత్తును ఐదేళ్ల పాటు నిర్ణయించే బాధ్యత కూడా. అందుకే ఓటర్లు కూడా గతంతో పోలిస్తే మరింత చైతన్యంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. మద్యం, డబ్బు, తాత్కాలిక ప్రలోభాలకు లొంగకుండా గ్రామాభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేసే అభ్యర్థికే ఓటు వేయాలని పలువురు గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో కొందరు అభ్యర్థులు ఓట్ల కోసం డబ్బు, మద్యం పంపిణీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. అలాంటి ప్రలోభాలను స్వీకరించడం వల్ల నష్టపోయేది చివరకు గ్రామమే. డబ్బు ఖర్చు చేసి గెలిచిన నాయకుడు ప్రజాసేవ కంటే ఖర్చు చేసిన సొమ్మును తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టే ప్రమాదం ఉంటుంది. మరోవైపు ప్రజలు కూడా కులం, పార్టీ, వ్యక్తిగత అనుబంధాలకు అతీతంగా అభ్యర్థి నిజాయితీ, సేవాభావం, పనితీరు, అభివృద్ధి దృష్టిని పరిశీలించి ఓటు వేయాల్సిన అవసరం ఉంది. గ్రామానికి మంచి రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, విద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించే నాయకుడే ప్రజల నిజమైన ప్రతినిధి.




**ప్రజలకు ఒక సందేశం:** ఒక్క ఓటు విలువ ఐదేళ్ల గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. క్షణిక ప్రయోజనం కోసం మీ ఓటును అమ్ముకోవద్దు. మీ పిల్లల భవిష్యత్తు, గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా ఓటు వేయండి.

**అభ్యర్థులకు ఒక సందేశం:** డబ్బు, మద్యం, బెదిరింపులతో కాదు... సేవా భావం, నిజాయితీ, ప్రజల విశ్వాసంతో ఎన్నికల్లో గెలవండి. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధే మీ లక్ష్యంగా పనిచేయండి. ప్రజాస్వామ్యంలో గెలవాల్సింది వ్యక్తులు కాదు... విలువలు. అభివృద్ధికి ఓటు వేయండి – గ్రామాన్ని గెలిపించండి.





# గత మే నెల 26నే చైర్మన్‌ను తొలగిస్తూ ఆర్బీఐ నోటీసు

**ప్రజల డిపాజిట్లను.. బ్యాంకును ప్రమాదంలో పెడుతున్న ఇన్నీస్ పేట బ్యాంక్ చైర్మన్ - గుట్టుగా హైకోర్టును ఆశ్రయించిన కోళ్ల**

**1964 సహకార చట్టం నుంచి 1995 మాక్స్ చట్టంలోకి మారేందుకు కుట్రలు - 30 ఏళ్ళుగా నిస్సిగ్గుగా బ్యాంక్‌ని పట్టుకు వేలాడుతున్న కోళ్ల**

**సర్వసభ్య సమావేశంలో సభ్యులు, ఛీ కొట్టినా మొండిగా డిపాజిట్ల దారులను తప్పుదోవ పట్టించే చర్యలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వందేళ్లు పైబడి చరిత్ర కలిగి, రూ. 160 కోట్ల రూపాయల ప్రజల సొమ్ము డిపాజిట్లు కలిగిన ది ఇన్నీస్పేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ప్రమాదంలో పెట్టేందుకు ప్రస్తుత చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు, బ్యాంకు సీఈవో, కొందరు డైరెక్టర్లు కుట్రలు చేస్తున్నారని బ్యాంకు డైరెక్టర్లు గుత్తుల భాస్కర్ రావు అందనాపల్లి సత్యనారాయణ తదితరులు విమర్శించారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా1964 సహకార చట్టం నుంచి 1995 మ్యాక్ చట్టంలోకి మారెందుకు చైర్మన్ కోళ్ల, ఇతరులు ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను, ప్రజలను, డిపాజిట్ దారులను తప్పుదోవ పట్టించే యాత్నాలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక వి.యల్.పురం, మార్గాని ఎస్టేట్స్, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా గుత్తుల భాస్కర రావు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పేసుకుని జెండా మోస్తున్నట్టు నటిస్తూ గత 30 సంవత్సరాలుగా బ్యాంకుని పట్టుకుని వేలాడుతున్న కోళ్ల బాబు ను ఆర్బిఐ గత నెల 25వ తేదీన పదవి నుంచి తొలగిపోవాలని నోటీసు జారీ చేసిందన్నారు. ఈ నోటీసును సిబ్బందికి, డిపాజిట్ల దారులకు, డైరెక్టర్లకు తెలియకుండా రహస్యంగా ఉంచి నోటీసుకు వ్యతిరేకంగా కోళ్ల హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. నాలుగు టెర్మ్‌ల పాటు చైర్మన్‌గా ఉన్న కోళ్ల.. బ్యాంకును అభివృద్ధి చేసింది లేదని, నిధుల వృద్ధిని పెంచలేదని, తనకు నచ్చని ఉద్యోగులను అక్రమంగా తొలగిస్తూ.. కోర్టు నుండి ఆర్డర్ తెచ్చుకున్నా వారిని విధుల్లోకి చేరనివ్వరని.. సిల్లీ రీసన్స్ తో డైరెక్టర్స్ ని తొలగిస్తుంటారని ఇప్పటికే నియంతలా ఉన్న కోళ్ల.. ఈ యాక్ట్‌లోకి బ్యాంక్‌ని చేర్చితే తన రాజ్యంగా ప్రకటించుకుంటారని ఉత్తర కొరియా కిమ్‌ని మించిపోతారని విమర్శించారు.

బ్యాంక్ శాఖలు తామొచ్చాకే పెంచినట్టు చెప్పారు. ఈ నెల 18వ తేదీన జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి 64 సహకార చట్టం నుంచి 95 మ్యాక్ చట్టంలోకి వెళ్లేందుకు తెర వెనుక మెజారిటీ లేని సభ్యుల సంతకాలను దుర్వినియోగం చేసేందుకు కుటిల యత్నాలు చేశారని చారు. గతంలో ఈయన నిర్వాకం వల్ల 39.50 లక్షల సర్చార్జ్ సహకార శాఖ విధించిందని ఆ విషయంలో పునీతుడైనట్టుగా క్లీన్ చిట్ వచ్చిందా.. బ్యాంకు మీద అభియోగాలు పోయాయా క్లీన్ చిట్ చూపించమని అడిగామని ఆ సమావేశంలో తన తో పాటు మరికొందరు డైరెక్టర్లు, డిపాజిట్ దారులు వ్యతిరేకించారని తెలిపారు. 95 మ్యాక్ చట్టం లోకి వెళ్లడం వల్ల కోళ్ల బాబు శాశ్వతంగా చైర్మన్ గా ఉంటాడని, డైరెక్టర్లు అతనిష్టానుసారం మారుతుంటారని, సొంత వర్గానికి ఉద్యోగ నియామకాలు చేపట్టవచ్చని, ప్రజల డిపాజిట్లకు గ్యారెంటీ ఉండదని, ఆర్బిఐ క్రమంగా పట్టించుకోవడం మానేస్తుందని,దానితో నియంత్రణ ఉండదని కుటుంబ సభ్యులకు పదవులు ఉద్యోగాలు ఇచ్చేసుకుని లక్షలాది రూపాయలు డ్రా చేసేసుకోవచ్చు.. ఇష్టం రాజ్యంగా బ్యాంకును పాలన సాగించవచ్చని ఇంట్లో వారికి కూడా ఇష్టం వచ్చినంత మొత్తంలో లోన్లు ఇచ్చుకొనే ప్రమాదం ఉందని రూపాయి వస్తువుకి పది రూపాయలు లోన్లు ఇచ్చినా నియంత్రణ ఉండదని.. తాను శాశ్వత చైర్మన్‌గా మారిపోవడం కోసం ఈ కుట్ర పన్నినట్లుగా ఆరోపించారు. జయలక్ష్మి, కార్తికేయ, మిత్ర, కృషి, ధనాబ్యాంక్‌ల సరసన చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు..మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ దూరదృష్టి వల్ల ఆనాడు ఎన్నికలు జరిగాయని. తిరిగిఈనాడు బ్యాంకు పతనావస్థ నుంచి కాపాడుకోగలిగామని కోళ్లతోపాటుగా ఎంతమంది డైరెక్టర్లని RBI అనర్హులుగా గుర్తించిందో.. వాళ్లు బ్యాంకుల్లో విధులు ఇకపై నిర్వహించవచ్చా లేదో సహకార శాఖ అధికారులు తెలియచేయాలని గుత్తుల ప్రశ్నించారు మరో డైరెక్టర్ అందనాపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు డిపాజిట్లకు, బ్యాంకు అభివృద్ధికి, ఎన్నికల ప్రక్రియకు నష్టం కలిగించే 95 మ్యాక్స్ చట్టాన్ని వ్యతిరేకించినట్లు తెలిపారు. సహకార చట్టంలో బ్యాంకు నిర్వాహన ఉండటం వల్ల ప్రజల డిపాజిట్లకు గ్యారెంటీ ఉంటుందని ,జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. 95 మ్యాక్ చట్టం అమలు చేయవద్దని తాను హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సహకార బ్యాంకుల అసోసియేషన్ అధ్యక్షుడు యజ్ఞవరపు మరిదయ్య మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా సహకార బ్యాంకుల రంగంలో డైరెక్టర్ గా, డిపాజిట్ దారుని గా ఉన్నానని పేర్కొన్నారు. సహకార బ్యాంకుల ఉద్దేశం దెబ్బ తినే విధంగా నగరంలోని స్వాతంత్రానికి పూర్వం ఉన్న కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల చైర్మన్ లు కోళ్ల బాబు తో పాటు మరికొందరు నియంత్రత్వ పోకడలతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 15 రోజుల క్రితం ఇన్నిస్పేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల బాబు ప్రజల సొమ్మును దివాలా చేసే విధంగా, తన పదవిని పట్టుకుని వేలాడేందుకు ప్రజాస్వామిక చర్యలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో బ్యాంకు ల పాలకవర్గాలు రాజకీయాలకు అతీతంగా ప్రజలు సొమ్ముకు ట్రస్టీగా , చిత్తశుద్ధితో పాలన చేసేవారు. నేటి రోజుల్లో రాజకీయ నాయకులు కాపాడతారనే నమ్మకంతో సహకార బ్యాంకుల పాలకవర్గాలు ప్రజల ఆస్తులతో కోళ్ల బాబు, ఇతర బ్యాంకుల చైర్మన్లు చెలగాటమాడుతున్నారన్నారు. ఈ చట్టం 1995లో వచ్చిందని గత 31 సంవత్సరాలుగా పక్కన పెట్టిన మార్పు ఇప్పుడే ఎందుకు తెస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఇంతకాలం అమాయక డిపాజిట్ దారుల, ప్రజల సహకారంతో, రాజకీయ పార్టీల అండదండలతో కొనసాగిన కోళ్ల ఆర్.బి.ఐ దిగిపొమ్మని చెప్పడంతో మ్యాక్ చట్టంలోకి ప్రవేశించేందుకు కుట్ర లేపాడన్నారు. గత నాలుగు టెర్మ్ గా బ్యాంకుకు ఎన్నికలు జరపకుండా చైర్మన్‌గా కోళ్ల వ్యవహరిస్తున్నాడని, గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ఎంపీ భరత్ ఒత్తిడితో గత్యంతరం లేక ఎన్నికలు పెట్టడం జరిగిందన్నారు. మ్యాక్ చట్టం కనుక అమల్లోకి తెచ్చుకుంటే నయానో, భయానో బహుమతులు ఇచ్చుకుని రెండు బై మూడు సభ్యుల మెజారిటీతో దొంగ దారిలో చైర్మన్ గిరి పొందాలని కోళ్ళ కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవల జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మెజారిటీ సభ్యులు లేరని, హాజరైన సభ్యుల సంతకాలతో హైకోర్టును తప్పు దోవ పట్టించే కుటిల యత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. అస్తవ్యస్తంగా సాగుతున్న బ్యాంకు పాలక వర్గం తీరుతో బ్యాంకు నుంచి డిపాజిట్ వెనక్కి తీసుకుంటున్నారని అన్నారు. బ్యాంకు చైర్మన్ ఆర్బిఐ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా సొంత వర్గంతో ఉద్యోగ నియమాకాలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బ్యాంకు నుండి కోళ్ల అక్రమంగా తొలగించిన మాజీ ఉద్యోగులు, డిపాజిట్ దారులు పాల్గొన్నారు.

## కంబాల దంపతులకు విమానాశ్రయంలో

# భారీ గజమాలలతో ఘన స్వాగతం

**మీ అభిమానాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుంటా : కంబాలలో నూతన ఉత్తేజం**





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు దంపతులు 40 రోజుల అమెరికా పర్యటన అనంతరం స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా రాజమహేంద్రవరం విమానాశ్రయంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల అభిమానులు మహిళలు పెద్ద ఎత్తున విచ్చేసి భారీ క్రేన్‌తో గజమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కంబాల దంపతులకు అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు, పూలమాలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరిస్తూ, కంబాల నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. బూరుగుపూడి, పశ్చిమ గోనగూడెం తదితర గ్రామాల్లో కంబాలకు మహిళలు నిరాంజనాలు పట్టారు. కోరుకొండ రామసేన కార్యాలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని, భారీ సంఖ్యలో దిష్టి గుమ్మడికాయలు దిష్టి తీసి, అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ తాను అందుబాటులో ఉన్న లేకున్నా ఎల్లవేళలా రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గంలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. తనకు ఘనంగా స్వాగతం పలకడానికి పెద్ద ఎత్తిన విచ్చేసిన మహిళలను, అభిమానులను చూసి కంబాలలో నూతన ఉత్తేజంతో అందర్నీ ఆప్యాయతగా పలకరిస్తూ, మీ అందరి అభిమానాన్ని గుండెల్లో చిరస్థాయిగా పదిలంగా దాచుకుంటానన్నారు. ఇదే ఆదరభిమానాలు తనకు ఎల్లవేళలా అందరూ అందజేయాల న్నారు. విచ్చేసిన ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుండి గోకవరం వరకు కంబాల వెంట భారీ బైక్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, పలువురు ఎన్డీఏ నాయకులు, కంబాల అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చర్యలు

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పురోగతిపై సమావేశం నిర్వహించిన కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఈ రోజు మధ్యాహ్నం ఆర్.పి.లు, బి.ఎల్.ఓ లు, అంగవాడి సిబ్బందితో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మూడవ వార్డు పరిధిలోని బూత్ నంబర్లు 127 నుంచి 131 వరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పనుల పురోగతిని బూత్‌ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు సవరణలు, మరణించిన మరియు ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాల సేకరణ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చర్యలు చేపట్టాలని, అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని బి.ఎల్.ఓలకు సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ నిర్ణీత గడువులోపు సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఓటర్ల కోసం రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలోని ప్రతీ వార్డులో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఎన్నికల సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ క్యాడర్ కి సూచనలు చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సంబంధిత బి.ఎల్.ఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# జిల్లా ఎస్పీని కలిసిన మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ పార్టీ నగర వైసిపి బీసీ నాయకుడు పీతా రామకృష్ణపై పెట్టిన పీడీ చట్టాన్ని ఉపసంహరించాలని మాజీ ఎంపీ, వైఎస్ఆర్సిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల రామకృష్ణ ను నగర పోలీసులు పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసి జైలుకు పంపించడం పంపించిన సంగతి విధితమే. ఈ సందర్భంగా ఎస్పీతో మాజీ ఎంపీ మాట్లాడుతూ, నగరంలో రామకృష్ణ తమ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీ నాయకులు చేసే అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించడంతో పెంచుకున్నాడన్నారు. అతనిపై 12 కేసుల్లో ఇరికించడంతో పాటు రౌడీ షీట్ కూడా తెరిసారని ఎస్పి దృష్టికి తెచ్చారు. ఈ కేసులపైన , రౌడీ షీట్ పై పోలీసుల వేధింపుల నుంచి మినహాయించాలని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దాంతో హైకోర్టు 10 కేసులు కొట్టి వేసిందని, కేవలం రెండు కేసులు మిగిలాయని, వాటిని ఆధారం చేసుకుని నగర ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు వేధింపులు గురి చేస్తున్నారని చెప్పారు. నగరంలో స్థానిక 40 వార్డులో అధికార పార్టీకి చెందిన రెండు గ్రూపుల మధ్య పేకాట, బ్రాకెట్ వంటి నేరపూరిత కార్యకలాపాల నిర్వహణలో విభేదాలు తలెత్తి కొట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘర్షణలో ఒక వర్గాన్ని తలలు పగిలిపోగా బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే ఎమ్మెల్యే దెబ్బలు తిన్నవారిపై సానుభూతి చూపించక, న్యాయం చేయకపోగా తిరిగి వారిపై మరొక కేసు నమోదు చేయించారని ఎస్పి దృష్టికి తెచ్చారు. పైగా ఆ వార్డులో పాటు నగరంలో ఏ వార్డులోనూ ప్రతిపక్ష వైసిపి పార్టీ వారిని, చివరకు మాజీ ఎంపీని సైతం తిరగనిచ్చేది లేదని అధికార పార్టీ నాయకులు, అనుచరులు బహిరంగంగా సవాళ్లు చేసి శాంతి భద్రతల సమస్యను సృష్టించారని తెలిపారు.

# బీసీ కాలనీలో బీజేపీ మండల పదాధికారుల సమావేశం



**రాజమండ్రి రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** బీజేపీని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజమండ్రి రూరల్ మండలంలోని కాతేరు బీసీ కాలనీలో మండల పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 1వ మండలం అధ్యక్షుడు నాగుల శివ అధ్యక్షత వహించగా, ప్రతి నెలా నిర్వహించే మండల పదాధికారుల సమావేశంలో స్టేట్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల ఇంచార్జ్ కందికొండ రమేష్, జిల్లా జనరల్ సెక్రటరీ శివ నాగరాజు, రాష్ట్ర మోర్చా అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వే నిర్వహించడం, ప్రతి బూత్‌లో బూత్ కమిటీల ఏర్పాటు, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి స్వామి సూర్య కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి కే. సురేష్ నాగమణి, మహిళా మోర్చా నాయకురాలు కమల కుమారి, ఎం. రాంబాబు, జి.శ్రీనివాస్, రామకృష్ణతో పాటు పలువురు ఓబీసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేతిలో తోలుబొమ్మలు

**మార్గాని భరత్ రామ్‌పై బురద జల్లితే ఎవరూ నమ్మరు**

**ప్రవీణ్ చౌదరి, రామశర్మపై మండిపడిన వైసీపీ లేడీ ఫైర్ బ్రాండ్ అనూ యాదవ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకప్పుడు మాజీ ఎంపి భరత్ రామ్‌కు సన్నిహితులుగా మెలిగిన రామశర్మ, ప్రవీణ్ చౌదరి ఇప్పుడు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేతిలో తోలుబొమ్మలని వారిద్దరూ భరత్ రామ్‌పై బురద జల్లాలని చూస్తే సహించేదిలేదని వైసిపి మహిళా నేత,లేడీ ఫైర్ బ్రాండ్ అను యాదవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భరత్ తో ఉన్నప్పుడు గంజాయి మొక్కలుగా అన్ని పార్టీల నుంచి విమర్శలు ఎదుర్కొన్న ఈ ఇద్దరు ఇప్పుడు ప్రజల దృష్టిలో తులసి మొక్కలుగా ఎలా మారిపోతారని ఆమె ప్రశ్నించారు.ఒక కార్పొరేట్ ప్రైవేటు స్కూలులో చదివే తన కుమారుడి ఆత్మహత్యను అడ్డు పెట్టుకుని సొమ్ములు లాగాలని ప్రవీణ్ చౌదరి చేసిన ప్రయత్నానికి భరత్ సహకరించకపోవడం వల్లే ఆయనపై బురద జల్లుతున్నారని ఇదేమి జనం నమ్మే పరిస్థితి లేదని అను యాదవ్ పేర్కొన్నారు. టిడిపి లోకి వెళ్లేందుకు ప్రవీణ్ శవరాజకీయాలు చేస్తున్నారని అనూ యాదవ్ ఆరోపించారు. తమ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా వీరిద్దరు ఎక్కడ ఉంటారో చూస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి పనులు చేస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్న భరత్ ను రాజకీయంగా దెబ్బతీయాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని అనూ యాదవ్ అన్నారు.జనం అన్నీ గమనిస్తున్నారు,ఎవరు ఎందుకు బురద జల్లు తున్నారు,వారి వెనుక ఎవరు ఉన్నారనేది అంతా గమనిస్తున్నారని, ఇకనైనా ప్రవీణ్ చౌదరి దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని అనూ యాదవ్ హితవు పలికారు.

# ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఐటీసీ, ప్రథమ్ సంస్థల ఆధ్వర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. శిక్షణకు అర్హతగా 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, ఇంటర్ లేదా పదో తరగతి మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. వివరాల నమోదు కోసం మండల కేంద్రమైన రాయవరంలో గల స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. అలాగే ఐటీసీ, ప్రథమ్ సంస్థల ఆధ్వర్యంలో అనపర్తి ఐటీసీ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, వెల్డింగ్ కోర్సులు, బాపట్లలో హోటల్ మేనేజ్‌మెంట్, గుంటూరులో మోటార్ మెకానిక్, హెల్త్ కేర్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494845337 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.






### రోజూ ఒక శివాలయానికి వెళ్లి అభిషేకం చేశా..

# శివమాల కూడా ధరించా : నాగబంధం హీరో



ఈ వారం థియేటర్లలో రిలీజయ్యే సినిమాల్లో అత్యంత ఆసక్తి కలిగిస్తోన్న చిత్రం 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. పెద కాపు సినిమాతో హీరోగా పరిచయమైన విరాట్ కర్ణ ఇందులో కథానాయకుడిగా కనిపించనున్నాడు. తాజాగా ఈ సినిమా కోసం తానెంత కష్టపడ్డాడో వివరించాడు విరాట్ కర్ణ. విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విరాట్ కర్ణ విలేకరుల సమావేశంలో సినిమా గురించి పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. విరాట్ కర్ణ మాట్లాడుతూ.. 'ఈ సినిమా నా అదృష్టంగా భావిస్తున్నాను. తొలి సినిమా పెదకాపు కూడా భారీ బడ్జెట్ సినిమానే. ఇప్పుడు నాగబంధం కూడా చాలా భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. పెదకాపు ఫలితం ఎలా ఉన్నప్పటికీ, ఒక నటుడిగా 100 శాతం కష్టపడ్డాను. ఆ పాత్రకు కావాల్సిన ప్రతిదీ చేశాను. నటుడిగా మంచి ప్రసంశలు వచ్చాయి. ఆ సినిమా కంటే ఈ సినిమాకు రెట్టింపు కష్టపడ్డాను'. 'నాగబంధం కథ విన్నప్పుడే నా పాత్ర ఎలా ఉండాలో ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. ఈ కథ నా కోసమే రాసినట్టుగా అనిపించింది. రుద్ర, నాగసాధు పాత్రల గురించి చెప్పినప్పుడు చాలా ఉత్సాహంగా అనిపించింది. ఇలాంటి సినిమా కోసం ఎదురు చూస్తున్నానని అనిపించింది. వెంటనే పాత్రకు తగ్గట్టుగా బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ చేసుకున్నాను. హార్స్ రైడింగ్ నేర్చుకున్నాను. డాన్స్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాను. పాత్రకు తగ్గట్టుగా నన్ను నేను పూర్తిగా మార్చుకున్నాను. ఇందులో నాగసాధు పాత్ర మేకప్ కి ఆరు గంటల సమయం పట్టేది. పరిశ్రమలో నాకంటూ ఒక గుర్తింపు రావాలని ఎప్పుడూ అనుకుంటుంటాను. ఒక నటుడికి ఇలాంటి పాత్ర రావడం గొప్ప అవకాశం. ఆ అవకాశం నాకు నాగబంధంతో వచ్చింది. ఈ సినిమా కోసం ఎంతగానో శ్రమించాను. షూటింగ్ సమయంలో నాకు జ్వరం ఉన్నా కూడా ఎక్కడా వెనకడుగు వేయలేదు. ప్రాణం పెట్టి పనిచేశాను'. 'సినిమా కథ విన్నప్పుడే రుద్ర పాత్ర ఎలా ఉండాలో పూర్తిగా అర్థమైంది. పాత్ర కోసం దాదాపు 20 కిలోల బరువు పెరిగాను. తర్వాత నాగసాధువుగా కనిపించడానికి మరో ఐదు కిలోలు తగ్గాను. బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాను. షూటింగ్ సమయంలో ప్రతిరోజూ ఒక శివాలయానికి వెళ్లి అభిషేకం చేసేవాడిని. షూటింగ్ పూర్తయ్యాక శివమాల కూడా ధరించాను. ఆ ప్రయాణంలో ఎన్నో శివాలయాలు సందర్శించాను. ప్రతిరోజూ షూటింగ్‌లో 300 మంది జూనియర్ ఆర్టిస్టులు, భారీ సెట్లు ఉండేవి. నమోరే పాట కోసం దాదాపు 5,000 మంది పాల్గొన్నారు. అయితే ఆ ఒత్తిడిని మొత్తం మా దర్శకుడు అభిషేక్ నామా గారే తీసుకున్నారు. "మంచి సినిమా చేస్తున్నాం... ఇవేమీ ఆలోచించకు" అని ఎప్పుడూ ధైర్యం చెప్పేవారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇప్పటివరకు చూసిన వారందరూ చాలా మంచి రిపోర్ట్ ఇస్తున్నారు. అభిషేక్ నామా గారికి మాస్ పల్స్ బాగా తెలుసు. ఆయన తీసిన ప్రతి సన్నివేశం నాకు గూస్‌బంప్స్ కలిగించింది. ప్రేక్షకులు కూడా థియేటర్లలో విజువల్‌గా చాలా గ్రాండ్‌గా ఎంజాయ్ చేస్తారు. నభా పాత్ర ఇందులో కీలకం. ఇందులో కొన్ని సస్పెన్స్‌లు ఉన్నాయి. అవి మీరు తెరపై చూసినప్పుడే తెలుస్తాయి. ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంది. పాటలు విజువల్‌గా చాలా గ్రాండ్‌గా వుంటాయి. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ పాత్ర కోసం నా వైపు నుంచి 100 శాతం కష్టపడ్డాను. ఈ సినిమాలో ఒక్క యాక్షన్ సీన్‌కూ డూప్ ఉపయోగించలేదు. అన్ని యాక్షన్ సన్నివేశాలు నేనే స్వయంగా చేశాను అని తెలిపాడు విరాట్ కర్ణ.

# లెనిన్ ట్రైలర్ వచ్చేసింది..! అదరగొట్టిన అఖిల్..

### ఈసారి హిట్టు పక్కా అంటున్న అభిమానులు




అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ లెనిన్. ఈ సినిమా పై అక్కినేని అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సారి లెనిన్ తో అఖిల్ హిట్ కొట్టేలా కనిపిస్తున్నాడు. అచ్చం హాలీవుడ్ హీరోల ఉండే హ్యాండ్సమ్ హీరో.. అయినా కూడా అఖిల్‌కు ఇప్పటి వరకు ఒక్క సాలిడ్ హిట్ పడలేదు. చేసిన సినిమాలన్నీ వరుస డిజాస్టర్స్ గా నిలిచాయి. వాటిలో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ పర్లేదు అనిపించినా మిగతా సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద పరాజయాన్ని మూటగట్టుకున్నాయి. ఇక ఎన్నో అంచనాల నడుమ వచ్చిన ఏజెంట్ కూడా దారుణంగా డిజాస్టర్ కావడం అఖిల్ అభిమానులను నిరాశకు గురి చేసింది. మొదటి సినిమా మొదలుకొని ఒక్కటంటే ఒక్క సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ అందుకోలేదు. దాంతో లెనిన్ సినిమా పై అక్కినేని అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. లెనిన్ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నాడు. గతంలో కిరణ్ అబ్బవరం నటించిన వినరో భాగ్యం విష్ణు సినిమాకు దర్శకత్వం వహించాడు మురళీ. ఇక లెనిన్ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తుంది. తాజాగా లెనిన్ సినిమా నుంచి ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమా పై అంచనాలను పెంచేసింది. లెనిన్ సినిమాలో అఖిల్ మాస్ అవతార్ లో కనిపించనున్నాడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అలాగే అఖిల్ యాక్టింగ్ కూడా ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమాలో శివాజీ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ ట్రైలర్ ఆకట్టుకుంది. లెనిన్ సినిమాకు తమన్ సంగీతాన్ని అందించారు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జులై 10న ఈ సినిమా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. లెనిన్ ట్రైలర్ పై మీరూ ఓ లుక్కేయండి.

## తారక్‌ను ముద్దుగా 'నాన్నా' అని పిలిచే ముగ్గురు హీరోలు ఎవరో తెలుసా?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ను ఇష్టపడని వారుండరు. సీనియర్ హీరోల నుంచి యంగ్ హీరోల వరకు అందరూ తారక్ ను అభిమానిస్తారు. ఇష్టపడతారు. ఈ క్రమంలోనే కొందరు హీరోలు, సీనియర్ నటుడు ఎన్టీఆర్ ను ముద్దు పేర్లతో కూడా పిలుస్తుంటారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్ గా మారిపోయాడీ మ్యాన్ ఆఫ్ మాసెస్. దేవర, వార్ 2 సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈ స్టార్ హీరో ఇప్పుడు డ్రాగన్ తో మరోసారి బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టేందుకు రెడీ అవుతున్నాడు. సినిమాల సంగతి పక్కన పెడితే..తెలుగు సినిమా ఇండస్ట్రీలో తారక్ ను అందరూ అభిమానిస్తారు. అందుకు కారణం అతని సినిమాలు మాత్రమే కారణం కాదు అతని వ్యక్తిత్వం కూడా. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరిని కలుపుకుని వెళ్లడం తారక్ కు బాగా అలవాటు. అందుకే స్టార్ హీరోలు సైతం ఎన్టీఆర్ తో జోవియల్ గా ఉంటారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తారక్ అయితే బావా బావా అని పిల్చుకుంటారు. ఇక రామ్ చరణ - తారక్ అయితే బ్రదర్ అని పిల్చుకుంటారు. అలాగే మహేష్ బాబును అన్నా ఆప్యాయంగా పలకరిస్తాడు తారక్. ఈ క్రమంలో జూనియర్ ఎన్టీఆర్ ను ప్రేమగా నాన్నా అని పిలిచే ముగ్గురు హీరోలు ఉన్నారు. అయితే అందులో ఇద్దరు హీరోలు ప్రస్తుతం ఈ లోకంలో లేరు. ఎన్టీఆర్ ను నాన్నా అని పిలిచిన మొదటి వ్యక్తి ఆయన తండ్రి హరికృష్ణ. ఏదైనా ఈవెంట్లలో అయినా.. బహిరంగ ప్రదేశాల్లో కూడా తారక్ ను నాన్నా అనే పిలిచేవారు హరికృష్ణ. అయితే 8 ఏళ్ల క్రితం ఆయన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అప్పటి నుంచి ఎన్టీఆర్ కు ఆయన అన్న కళ్యాణ్ రామ్ పెద్ద దిక్కుగా ఉన్నారు. అందుకే తండ్రిలాగా కళ్యాణ్ రామ్ కూడా తారక్ ను నాన్నా అని పిలుస్తుంటారు. తల్లులు వేరైనా రామ లక్ష్మణుల్లా కలిసి ఉంటారు ఎన్టీఆర్, కల్యాణ్ రామ్. సొంత అన్నదమ్ముల కంటే ఎక్కువ అనుబంధంతో కలిసి మెలిసి ఉంటారీ నందమూరి బ్రదర్స్. ఇక కుటుంబ సభ్యులు కాకుండా బయటి నుంచి ఎన్టీఆర్ ను నాన్నా అని పిలిచే వ్యక్తి రియల్ స్టార్ శ్రీహరి. బృందావనం సినిమాతో వీరి అనుబంధం చాలా బలపడిపోయింది. అలా శ్రీహరి కూడా ఎన్టీఆర్ ను నాన్నా అని పిలిచే వారు. కానీ ఈ నటుడు కూడా 49 ఏళ్ళ చిన్న వయసులోనే కన్ను మూశారు.

# ఇంగ్లండ్‌తో తొలి పోరుకు భారత్ రెడీ..

### పిచ్ రిపోర్ట్ చూస్తే మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే..!




ఐర్లాండ్ సిరీస్ ఓటమి గాయం నుంచి కోలుకోవాలన్నా, విమర్శకుల నోళ్లు నొక్కాలన్నా భారత్‌కు ఈ మ్యాచ్‌లో విజయం అత్యంత అవసరం. చెస్టర్ లే స్ట్రీట్ పిచ్ బౌలింగ్‌కు అనుకూలిస్తున్న నేపథ్యంలో, టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. మరి భారత యువ సింహాలు ఇంగ్లండ్ పేస్ విసిరే సవాళ్లను తట్టుకుని నిలబడతాయో లేదో చూడాలి. ఐర్లాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాభవాన్ని మరచిపోకముందే టీమిండియా మరో కఠిన సవాలుకు సిద్ధమైంది. ఇంగ్లండ్‌తో జరగబోయే ప్రతిష్ఠాత్మక ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా నేడు తొలి సమరం జరగనుంది. అయితే, ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న చెస్టర్ లే స్ట్రీట్ పిచ్ రిపోర్ట్ ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇక్కడ పరుగుల వరద పారుతుందా లేక బౌలర్లు రాజ్యమేలుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**ఐర్లాండ్ చేతిలో అవమానం.. ఇంగ్లండ్ గడ్డపై ప్రతీకార సమయం!**

ఇటీవలే ముగిసిన టీ20 సిరీస్‌లో పసికూన ఐర్లాండ్ చేతిలో 0–2తో వైట్‌వాష్‌కు గురైన భారత యువ జట్టు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఆ అవమాన భార భారాన్ని గుండెల నిండా మోస్తూ.. ఆ చేదు జ్ఞాపకాలను చెరిపేయాలని శ్రేయస్ అయ్యర్ సేన పట్టుదలతో ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా చెస్టర్ లే స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ గ్రౌండ్ స్టేడియంలో జరిగే ఈ పోరు ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. పటిష్టమైన ఇంగ్లండ్‌ను వారి సొంత గడ్డపై ఢీకొట్టడం భారత్‌కు అంత తేలికైన విషయం కాదు, ముఖ్యంగా ఇక్కడి పిచ్ స్వభావం తెలిస్తే బ్యాటర్లకు కాస్త వణుకు పుట్టడం ఖాయం.

**బ్యాటర్లకు నరకప్రాయం.. బౌలర్లకు పండగేనా?**

ఈ మైదానంలో చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, ఇక్కడ పరుగుల వరద పారడం చాలా అరుదు. ఇదొక లో–స్కోరింగ్ పిచ్ అని ఇక్కడి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటివరకు ఈ పిచ్‌పై కేవలం 5 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు మాత్రమే జరిగాయి. ఇందులో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు కేవలం 136 పరుగులు మాత్రమే కావడం గమనార్హం. దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు, ఇక్కడ బ్యాటర్లకు భారీ షాట్లు ఆడటం ఎంత కష్టమో! మ్యాచ్ ప్రారంభంలో పిచ్ నుంచి లభించే అదనపు బౌన్స్, స్వింగ్ కారణంగా పేస్ బౌలర్లు వికెట్ల పండగ చేసుకునే అవకాశం ఉంది. అయితే, ఇక్కడ స్పిన్నర్లకు పెద్దగా టర్న్ దొరకదు. కానీ, ఇంగ్లండ్ వాతావరణ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని పేసర్లు విరుచుకుపడే ప్రమాదం ఉంది. బ్యాటర్లు క్రీజులో కాసేపు కుదురుకుంటేనే పరుగులు రాబట్టడం సాధ్యమవుతుంది.

**రివర్‌సైడ్ గ్రౌండ్ స్టేడియం రికార్డులు ఇవే:**

మొత్తం మ్యాచ్‌లు: 5, తొలి బ్యాటింగ్ చేసి గెలిచినవి: 3, రెండోసారి బ్యాటింగ్ చేసి గెలిచినవి: 2, తొలి ఇన్నింగ్స్ యావరేజ్ స్కోరు: 136, అత్యధిక స్కోరు: 195/5 (ఇంగ్లండ్ వర్సెస్ ఆస్ట్రేలియా), అత్యల్ప స్కోరు: 155/10 (ఇంగ్లండ్ వర్సెస్ వెస్టిండీస్), అత్యధిక ఛేజింగ్: 143/3 (ఇంగ్లండ్ వర్సెస్ న్యూజిలాండ్), ప్రతి వికెట్‌కు సగటు పరుగులు: 22.40, ఓవర్‌కు సగటు పరుగులు: 8.15

**యువ రక్తం వర్సెస్ అనుభవజ్ఞుల పోరు..**

ఈ సిరీస్ కోసం భారత్ సరికొత్త యువ జట్టుతో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి హిట్టర్లు ఉన్నప్పటికీ, ఇక్కడి కఠిన పరిస్థితులను వారు ఎలా ఎదుర్కొంటారనేది చూడాలి. మరోవైపు, హ్యారీ బ్రూక్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టులో జోస్ బట్లర్, సామ్ కరన్, జోఫ్రా ఆర్చర్ వంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఉన్నారు. సొంత గడ్డపై ఉన్న అనుకూలత వారికే ఎక్కువ ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.




### వంద శాతం ఫిట్‌గా ఉన్న
## ప్లేయర్లే ఆడారా..?
సునీల్ గావస్కర్

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి భారత్ లీగ్ దశలోనే ఇంటి ముఖం పట్టడంపై టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ స్పందించాడు. టోర్నీలో వంద శాతం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను భారత్ ఆడించిందా? అని సందేహం వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియాతో చావో రేవో లాంటి మ్యాచ్‌లో ఓటమి పాలైన భారత్ సెమీస్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. "ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోవడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. కానీ, అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను టీమ్ఇండియా ఓడించాల్సింది. ఆ మ్యాచ్‌లో మంచి స్థితిలో ఉండి కూడా పేలవమైన ఫీల్డింగ్‌తో ఓటమిపాలయ్యారు. ఆ మ్యాచ్‌తోనే భారత్ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించింది. చాలామంది క్రికెట్ అభిమానులు అడిగే ప్రశ్న ఏంటంటే.. మనం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను టోర్నీలో ఆడించామా?ఒక ప్లేయర్ పూర్తిగా ఫిట్‌గా లేకపోయినా రాణించగల ప్రతిభావంతులైతే వారిని ఆడించడం అర్థం చేసుకోదగినదే. గాయపడిన ప్లేయర్ స్థానాన్ని భర్తీ చేయడానికి రిజర్వ్‌లో ఉన్నవారు సరిపోరని భావించినప్పుడు కూడా ఇలా చేయొచ్చు. అయితే.. టీమ్ ఇండియా విషయంలో ఇలా జరిగి ఉంటుందని నేను అనుకోవడం లేదు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

## హర్మన్‌కే పగ్గాలు.. ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు ఇదే..



ఈ ఏడాది ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. స్మృతి మంధానను వైస్ కెప్టెన్ గా నియమించింది. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మన జట్టు ఫైనల్‌కు చేరకుండానే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ హర్మన్‌పై మేనేజ్‌మెంట్ నమ్మకం ఉంచి.. ఆసియా క్రీడలకు సారథ్య బాధ్యతలను అప్పగించింది. ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన జట్టులోని మిగతా సభ్యుల్లోనూ పెద్దగా మార్పులు చేయలేదు. వికెట్‌కీపర్ బ్యాటర్ యస్తికా భాటియాను మాత్రమే తప్పించి.. ఆమె స్థానంలో జి. కమిలినిని బీసీసీఐ ఎంపిక చేసింది. ప్రపంచకప్ టోర్నీ సమయంలో గాయపడిన శ్రేయాంక పాటిల్‌కు ఆసియా క్రీడల్లోనూ స్థానం కల్పించారు. అయితే, టోర్నీకి ముందు ఆమె ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది. జపాన్ వేదికగా సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో టీమ్ఇండియా మహిళల జట్టు స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మన అమ్మాయిలు డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా టోర్నీలో దిగనున్నారు.

**భారత జట్టు ఇదే..**

హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి.కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ

## బెంగళూరుకు షిఫ్ట్ అయిన హార్దిక్ పాండ్య



టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ముంబయి నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. హార్దిక్ ఇక నుంచి తన కెరీర్ కొనసాగించినంత కాలం జశీజుని శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకోవాలనే ఉద్దేశంతో బెంగళూరుకు మకాం మార్చాడు. ముంబయిలో శిక్షణ కోసం ప్రతిరోజూ చాలా దూరం ప్రయాణించడం సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడట. పాండ్య ఇకపై ఐపీఎల్, జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌లు లేనప్పుడల్లా జశీజులో శిక్షణ పొందనున్నాడు. ఈ విషయాన్ని బీసీసీఐ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. జశీజులో ట్రెనింగ్ సెషన్స్‌లో సహకరించడానికి హార్దిక్ సొంతంగా ఫిజియోథెరపిస్ట్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌ను ఏర్పాటు చేసుకుంటాడట. ఐపీఎల్ సమయంలో తగిలిన గాయం నుంచి హార్దిక్ పూర్తిగా కోలుకోలేదు. దీంతో జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు పాండ్య దూరమయ్యాడు. అతడికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తే జులై నెలాఖరులో జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌కు ఎంపిక చేసే అవకాశముంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com